# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 145 | విశాఖపట్నం | 25-2-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 145 | VISAKHAPATNAM | 25-2-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



## రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ — PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902




## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఇద్దరు పోలీసు అధికారులు

2లో



## తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత దేవ్ జీ

2లో




## కాలేయానికి వచ్చే వ్యాధులు!

6లో

# 20 కోట్ల లడ్డూలు కల్తీ నెయ్యితో చేశారు: చంద్రబాబు

**అమరావతి, పతాకం న్యూస్:** వైఎస్సార్సీపీ హయాంలో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని సీఎం చంద్రబాబు తెలిపారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని అన్నారు. మంగళవారం తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో సీఎం మాట్లాడుతూ 'మహాపాపం' పేరిట గత ప్రభుత్వం లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వైఎస్సార్సీపీ నేతలు ఒక లడ్డూ విషయంలోనే కాదు అనేక విషయాల్లో తప్పు చేశారని కుట్ర కోణాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. 2019-24 మధ్యకాలంలో 20 కోట్ల లడ్డూలు కల్తీ నెయ్యితో చేశారని సీఎం అన్నారు. 59.71 లక్షల కేజీల కల్తీ నెయ్యి వినియోగించారని ఇంక రూ.234.51 కోట్ల నిధుల అక్రమాలు జరిగాయని వివరించారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని ల్యాబ్‌లకు కన్నుకప్పి టెండర్లు దక్కించుకున్నారని వెల్లడించారు. 23.01.2026న సీబీఐ ఛార్జిషీట్ వేసిందని తెలిపారు. ఇంక కల్తీ నెయ్యి తయారీకి చాలా రసాయనాలు వాడారని అన్నారు. మోనో గ్లిసరైడ్స్, లాక్టిక్ యాసిడ్ యానిమల్ వెజిటబుల్ ఫ్యాట్ నుంచి వస్తుందని, రంగు కోసం బీటా కెరాటిన్, వాసన కోసం ఎపిటిక్ యాసిడ్ ఈస్టర్, నెయ్యిలా కనిపించడానికి సింథటిక్ ఫ్లేవర్, నురుగు రావడానికి లబ్సా యాసిడ్ డిజర్టెంట్‌లో వాడతారని సీఎం వివరించారు. రాజకీయ వివాదం ఉండకూడదని సిట్ ఏర్పాటు: రాజకీయ వివాదం ఉండకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేశారని సీఎం చంద్రబాబు తెలిపారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించిందని అలానే తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించిందని వెల్లడించారు. అందుకే ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించామని అన్నారు. లడ్డూ వ్యవహారంలో కాకుండా అనేక విషయాల్లో తప్పులు చేశారని ఒక పద్ధతి ప్రకారం లాలూచీ పడిన లూటీ అని స్పష్టంగా తేలిందని



చెప్పారు. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా రిపోర్టును తొక్కిపెట్టారని వెల్లడించారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని తాను సొంతంగా ఏమీ చెప్పలేదు ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టునే చెప్పానని ఆ భగవంతుడే నాతో చెప్పించాడని సీఎం చంద్రబాబు అన్నారు. వారికి అనుగుణంగా నిబంధనలన్నీ సడలించారని రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధన తొలగించారని సీఎం చంద్రబాబు అన్నారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించారని అలానే రోజుకు 12 టన్నులుగా ఉండాల్సిన వెన్న తయారీ 8 టన్నులకు (తరువాయి 2వ పేజీలో)

## రూ.12,236 కోట్లతో రైల్, మెట్రో, ఎయిర్ పోర్ట్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నూతన పీఎంఓ బిల్డింగ్ సేవా తీర్థ్‌లో మంగళవారంనాడు మంత్రివర్గం సమావేశమైంది. కేరళ పేరు మార్పుతో సహా పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. సమావేశానంతరం ఆ వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు (తరువాయి 2వ పేజీలో)



## పులివెందులలో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన జగన్

2లో

## ఎవరైనా సరే ఆడబిడ్డల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదు: అనిత



**అమరావతి, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గాయని, ఎవరైనా సరే ఆడబిడ్డల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై శాసన మండలిలో చర్చ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడారు. సీఎం చంద్రబాబు తీసుకున్న చర్యల వల్లే 20 నెలల్లో రాష్ట్రంలో నేరాలు 6.6 శాతం

(తరువాయి 4వ పేజీలో)

## సోము వీర్రాజుపై బొత్స వ్యాఖ్యలు
# అభ్యంతరకరం: లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్ సోము వీర్రాజును ఉద్దేశించి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వ్యాఖ్యలు వ్యక్తిగత దాడి కిందకే వస్తాయని, వాటిని తక్షణమే సభా రికార్డుల నుంచి తొలగించాలని ఛైర్మన్‌ను డిమాండ్ చేశారు. వాస్తవాలు వినే ఓపిక లేక వాకౌట్ చేయడం ప్రతిపక్ష నేత బొత్సకు ఫ్యాషన్ గానే కాకుండా, ప్యాషన్‌గానూ మారిందని ఆయన ఎద్దేవా చేశారు.మంగళవారం నాడు శాసనమండలిలో శాంతిభద్రతల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చ వాడివేడిగా సాగింది. ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. చిలకలూరిపేటలో జరిగిన ప్రధాని సభను సరిగా నిర్వహించలేకపోయారని, భద్రతా వైఫల్యం కారణంగానే అప్పటి ఎస్పీపై బదిలీ వేటు పడిందని గుర్తుచేశారు. సోము వీర్రాజు వ్యాఖ్యలపై వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం తెలిపారు. సోము వీర్రాజు ఎవరో ఒకరిని మెప్పించడానికి, భజన (తరువాయి 2వ పేజీలో)

## నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ అబద్ధాలు చెబుతోంది: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ అసెంబ్లీలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించిన కల్తీ నెయ్యిపై లఘు చర్చ కొనసాగుతోంది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సభలో మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి ఉపయోగించలేదని ఇప్పటికే తేలిపోయిందన్నారు. నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ అబద్ధాలు చెబుతోందని.. అందుకే తాము వివరణ ఇవ్వాల్సి వచ్చిందని పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి తయారీలోనూ సృజనాత్మకత చూపించారని.. నెయ్యి కావాలంటే పాల నుంచే కాదు రసాయనాల నుంచీ తయారు చేయొచ్చని నిరూపించారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాధినేత

(తరువాయి 2వ పేజీలో)


పతాకం న్యూస్ — PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## విషపు పాలు!

'రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి నలుగురు మరణించడం బాధాకరం. ఇప్పటికీ ఇద్దరు వెంటిలేటర్‌పై ఉండగా, ఎనిమిది మంది తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. నగర శివారుకు చెందిన డజను మంది అనూరియా (మూత్రం ఆగిపోవడం) లక్షణాలతో ఒకేసారి ఆస్పత్రులల్లో చేరడంతో కలకలం లేచింది. పరిస్థితి డయాలసిస్, కిడ్నీల ఫెయిల్యూర్ వరకు వెళ్లడంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు అలముకున్నాయి. అనారోగ్యం పాలైన వారు వృద్ధులు, చిన్నారులే కావడం పెద్ద విషాదం. అప్రమత్తమైన అధికార యంత్రాంగం కారణాలను అన్వేషించే పనిలో పడింది. కోరుకొండ మండలం పర్సాపురం గ్రామానికి చెందిన వరలక్ష్మి డెయిరీ నుంచి సరఫరా అయిన కల్తీ పాలే పలువురి అస్వస్థతకు హేతువని ప్రాథమికంగా గుర్తించారు. డెయిరీ నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని కూపీ లాగుతున్నారు. కల్తీ పాల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించడంతోపాటు బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని పేర్కొంది. మృతుల కుటుంబాలకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారి పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తానంది. ఈ మేరకు శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసన మండలిలో హోం మంత్రి అనిత ప్రకటనలు చేశారు. స్వచ్ఛతకు మారుపేరుగా పాలను పేర్కొంటారు. అటువంటి పాలను అమితమైన లాభార్జన కోసం కాలకూట విషం కావించడం అమానవీయం. ఒకప్పుడు పాలల్లో నీళ్లు కలపడాన్ని పెద్ద నేరంగా పరిగణించేవారు. ఇప్పుడు పాలంటే హడలెత్తే స్థితికి కల్తీ దందా చేరుకోవడం ఆందోళన కలిగిస్తుంది. పాలు ప్రజలకు నిత్యావసర వస్తువు. పసికందుల దగ్గర నుంచి వృద్ధుల వరకు పాలే జీవనాధారం. పాలు తాగితే చాలా వరకు మన శరీరానికి కావాల్సిన సంపూర్ణ పోషకాలు సమకూరుతా యన్నది ఆరోగ్య నిపుణుల మాట. అటువంటి పాల వ్యాపారంపై ప్రభుత్వ నియంత్రణ ఎంత? ఫుడ్ సేఫ్టీ అడ్రస్ ఎక్కడీ కాలం చెల్లిన, నాసిరకం, కల్తీ పాలను గుర్తించే వ్యవస్థ అసలు ఉందా? ఈ ప్రశ్నలు ప్రజలను వేధిస్తుంటాయి. గతంలో రైతులు తమకు తాముగా నిర్వహించుకునే సహకార వ్యవస్థ బలంగా ఉన్నప్పుడు పాల కల్తీ ఉండేది కాదు. ఎప్పుడైతే ప్రైవేటు డెయిరీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయో అప్పటి నుంచి కల్తీ విచ్చలవిడైందన్న ఆరోపణలు బాగా ముందుకొచ్చాయి. పాడి-పంట.. గ్రామీణ ప్రాంతాల్లో రైతుతో విడదీయరాని బంధం. గ్రామీణ మహిళలే పాడిని నిర్వహిస్తారు. కానీ కష్టపడి పాలను ఉత్పత్తి చేసిన రైతుకు గిట్టుబాటు ధర దక్కదు. వారి వద్ద నుంచి పాలను సేకరించిన ప్రైవేటు డెయిరీలకు మాత్రం లాభాల పంట పండుతుంది. రోజూ ఉత్పత్తవుతున్న పాలల్లో ప్రైవేటు, సహకారం రెండూ కలిపినా కూడా సంఘటితరంగం కిందికొచ్చేవి సగం కూడా లేదన్నది ప్రభుత్వ అంచనా. ప్రపంచబ్యాంక్ ఆదేశాలకు తలొగ్గి ప్రభుత్వం దశలవారీగా సహకార రంగాన్ని నిర్వీర్యం చేయడంతో ప్రైవేటు ఆధిపత్యం అంతకంతకూ పెరుగుతోంది. డెయిరీల మధ్య అనారోగ్య పోటీ నెలకొంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం సహకార రంగాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్నాక డెయిరీ ప్రైవేటీకరణ కాస్తా కార్పొరేటీకరణ బాట పట్టింది. ఎప్పుడైతే పరిస్థితి మారిందో చిన్నా చితకా డెయిరీలు సైతం లాభాల కోసం తప్పుడు దారులు వెతుకుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడు తున్నాయి. రాష్ట్రంలో పాడి పశువుల సంఖ్యపై అనుమానా లున్నాయి. ప్రజల ఆరోగ్యాలను హరించే సింథటిక్ పాలు, యూరియా వంటి రసాయనాలతో తయారు చేసిన పాలు మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయన్న ఫిర్యాదులొస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృత్రిమ మేధ పల్లవి ఎత్తుకోగా పాల వ్యాపారులు ఏకంగా కృత్రిమ పాలను ఉత్పత్తి చేస్తున్నట్లు కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వ ఫుడ్‌ప్రాసెసింగ్ పాలసీలో భాగంగా రాష్ట్రానికొస్తున్న పరిశ్రమల్లో పాలు, పదార్థాలకు సంబంధించిన యూనిట్లే ఎక్కువ. వాటికి ప్రభుత్వం అపరిమితమైన రాయితీలిస్తోంది. సదరు పరిశ్రమలు ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు విక్రయిస్తున్నాయా లేదా అనే ప్రభుత్వ తనిఖీలు అనుమానమే. తనిఖీ బాధ్యతను ఆయా సంస్థలకే వదిలేసినట్లు కనిపిస్తుంది. అదే జరిగితే నాణ్యతకు పాతరేసినట్లే. పాలతో సహా యావత్ ఫుడ్ సేఫ్టీ బాధ్యత ప్రభుత్వానిదే. అందుకు పటిష్టమైన వ్యవస్థ అవసరం. లేదంటే ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది.

## పులివెందులలో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన జగన్



**పులివెందుల, పతాకం న్యూస్:** వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పర్యటన ప్రారంభించారు. ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగుతోంది. ఇందులో భాగంగా ఆయన ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. మంగళవారం పులివెందుల చేరుకున్న జగన్‌కు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాత్రికి ఆయన అక్కడే బస చేయనున్నారు. పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం 9:30 గంటలకు జగన్ వేంపల్లి మండలం నందిపల్లి గ్రామానికి వెళ్తారు. అక్కడ నూతనంగా నిర్మించిన నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం పులివెందులకు తిరిగి వచ్చి, మధ్యాహ్నం మరోసారి క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడానికే ఈ పర్యటన చేపట్టారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

(మొదటిపేజీ తరువాయి)

### చేశారు: చంద్రబాబు

తగ్గించారని తెలిపారు. డెయిరీల వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పరిమితం చేశారని వెల్లడించారు. సాంకేతిక అధ్యయనం, ఫీల్డ్ విజిట్లకు పూర్తిగా మినహాయింపు ఇచ్చి ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారని మండిపడ్డారు. వారికి తెలియకుండా జరుగుతాయా: పోమిల్ జైన్, విపిన్ జైన్, భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ ప్రధాన సూత్రధారులని సీఎం వివరించారు. నెయ్యి సరఫరా చేసిన షెల్ కంపెనీలు ఏఆర్ డెయిరీ ఫుడ్స్, శ్రీవైష్ణవి డెయిరీ, మాల్ గంగా మిల్క్ డెయిరీ అని భోలే బాబా డెయిరీకి షెల్ కంపెనీలు సహకరించాయని తెలిపారు. లంచం డబ్బుతో చిన్నప్పన్న దొరికిపోయారని ఈ కల్తీ నెయ్యి సరఫరాదారులకు చిన్నప్పన్న సహకారం అందించారని చెప్పారు. తప్పుడు రిటర్నులతో బురిడీ కొట్టించి ల్యాబ్ నివేదిక ఫోర్జరీ చేశారని వివరించారు. ఇన్ని జరిగితే టీటీడీ బోర్డు ఈవో, ఛైర్మన్‌కు తెలియకుండా జరుగుతాయా అని ప్రశ్నించారు. ప్రసాదం తీసుకున్న ప్రతి ఒక్కరూ నాణ్యత తగ్గిందని చెప్పారని సీఎం తెలిపారు.

### అభ్యంతరకరం: లోకేశ్

చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కూటమి పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శిస్తూ, చర్చలో ప్రధాని ప్రస్తావన తీసుకురావడాన్ని నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. దీనిపై హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. వైసీపీ సభ్యులు అబద్ధాలు చెప్పి వాకౌట్ చేస్తారని విమర్శించారు. అనంతరం మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ బొత్స తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "బొత్స వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరం. మేం ఇక్కడికి సభ్యులను మెప్పించడానికి రాలేదు. ఆ రోజు ప్రధాని సభలో మేమంతా ఉన్నాం. ఎంత ఇబ్బంది పడ్డామో మాకు తెలుసు. కనీస భద్రత కల్పించలేదు, బ్యారికేడ్లు విరిగిపోయాయి. ప్రధాని మాట్లాడుతుండగా మైక్ కూడా కట్ అయింది. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం నోటీసు ఇచ్చి అధికారులను సస్పెండ్ చేసిన విషయం బొత్స తెలుసుకోవాలి" అని లోకేశ్ అన్నారు. "శాంతిభద్రతలపై చర్చ జరుగుతుంటే వాకౌట్ ఎందుకు? వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత మాపై, వినాల్సిన బాధ్యత వారిపై లేదా? మధ్యాహ్నం రెండు కాగానే వారికి ఆకలేస్తుంది, వాకౌట్ అని బయటకు వెళతారు. సోము వీర్రాజుపై బొత్స వ్యక్తిగత దాడికి దిగారు. ఇది ఏమాత్రం సరికాదు. ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలి" అని లోకేశ్ మండలి ఛైర్మన్‌ను కోరారు. దీంతో సభలో కొంతసేపు గందరగోళ వాతావరణం నెలకొంది.

### రూ.12,236 కోట్లతో రైల్, మెట్రో, ఎయిర్ పోర్ట్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

తెలిపారు. కేరళ పేరును కేరళంగా మార్చే ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని, పేరు మార్పు బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదానికి పంపుతామని మంత్రి తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తరువాత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడ తామని చెప్పారు. రూ.12,236 కోట్ల అంచనా వ్యయంతో మౌలిక సదుపాయాలు, విధానపరమైన నిర్ణయాలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో రైల్వేలు, అర్బన్ ట్రాన్‌పోర్ట్, ఏవియేషన్, మౌలికసదుపాయాల కల్పన వంటివి ఉన్నాయి. విద్యుత్ రంగం సంస్కరణలపై కూడా విధానపరమైన నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.5.236 కోట్ల అంచనా వ్యయంతో గోండియా-జబల్‌పూర్ రైల్వే లైను డబ్లింగ్ పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.2,668 కోట్ల పెట్టుబడితో్ాబఝుతీఝునెష్త్ర ఖఅఒ ఖఱబశ్రీ మధ్య 3,4వ రైల్ లైన్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. రూ.1,168 కోట్ల అంచనా వ్యయంతో +ఝఎష్ఝుతీఝు ఖఅఒ జష్ఝుఅఒఱశ్రీ మధ్య 3,4వ రైల్వే లైన్ నిర్మాణానికి, రూ.1,667 కోట్లతో శ్రీనగర్‌లో కొత్త ఇంటిగ్రేటెడ్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్‌కు సమ్మతి తెలిపింది. రూ.1,067 కోట్లతో అహ్మదాబాద్ మెట్రో ప్రాజెక్టు ఫేజ్-2బి విస్తరణకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

### నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ అబద్ధాలు చెబుతోంది: పవన్

తప్పుచేశారని తానెక్కడా చెప్పలేదని.. అప్పటి టీటీడీ పాలకమండలి తన బాధ్యత నిర్వహణలో విఫలమైందని విమర్శించారు. తాము ఏ ఒక్కరిపైనా ఆరోపణలు చేయడం లేదని.. జగన్ నియమించిన బోర్డు హయాంలోనే తప్పు జరిగిందని డిప్యూటీ సీఎం అన్నారు. నాటి టీటీడీ బోర్డు సభ్యులను మాజీ సీఎం జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారని ప్రశ్నించారు. 'దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవచ్చని జగన్ చెబితే సరిపోయేది.. వెనకేసుకొస్తున్నారంటే మీకూ భాగస్వామ్యం ఉన్నట్టే కదా?' అని అనుమానం వ్యక్తం చేశారు పవన్. అసలు నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ నేతలు చెప్పడమేంటని నిలదీశారు. ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు కుట్ర జరిగిందని సిట్ తేల్చిందని చెప్పారు. నచ్చినవారికి కాంట్రాక్టులు ఇచ్చుకునేందుకు నిబంధనలు సడలించారని పవన్ ఆరోపించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఇద్దరు పోలీసు అధికారులు





**కడప, పతాకం న్యూస్:** పోలీసు స్టేషన్లో పోలీసు అధికారులు కేసులు ఛేదించడానికి కంటే సెటిల్‌మెంట్లు, పంచాయితీలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారనే అపవాదును మూటగట్టుకుంటోంది. ఏసీబీ అధికారులు సైతం చిన్న చిన్న అధికారులపై దృష్టి సారిస్తున్నారు తప్పితే పోలీసు అధికారుల జోలికి వెళ్లడం లేదనే విమర్శలు సర్వత్రా వెలువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కడప జిల్లాలో చాలా ఏళ్ల తర్వాత ఏకంగా ఇద్దరు పోలీసు అధికారులను ఏసీబీ ట్రాప్ చేసి పట్టుకోవడం సంచలనం కలిగించింది. బాధితుడు సైతం పోలీసులపై ధైర్యంగా ఫిర్యాదు చేయడంతో పులివెందుల రూరల్ సీఐ ఎన్వీ రమణ, సింహాద్రిపురం ఎస్సై అనిల్‌కుమార్‌లు లక్షన్నర రూపాయలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇటీవల పోలీసు ఉద్యోగం సంపాదించిన ఎస్సై అనిల్‌కుమార్ ఉద్యోగంలో చేరి ఏడాది తిరగకముందే లంచం కేసులో ఏసీబీకి పట్టుబడటం గమనార్హం. వైఎస్సార్ జిల్లాలో అవినీతి పోలీసులను అవినీతి నిరోధక శాఖ వల వేసి పట్టుకుంది. దొంగతనం పోలీసులను ఛేదించడం చేతకాక వేరొకరిని కేసులో ఇరికించేందుకు భయపెట్టి లంచం డిమాండ్ చేయడంతో ఇద్దరు పోలీసు అధికారులు ఏసీబీకి దొరికిపోయారు. పులివెందుల రూరల్ సర్కిల్ పరిధిలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. వెంకటరమణ, సింహాద్రిపురం సబ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ బాధితుల నుంచి లక్షన్నర రూపాయలు లంచం తీసుకుంటుండగా కడప ఏసీబీ డీఎస్పీ సీతారామరావు బృందం పట్టుకుంది. దీనికంతటికీ ప్రధాన కారణం పులివెందుల, సింహాద్రిపురం మండలాల్లో వరసగా గొలుసు దొంగతనాలు జరగడమే. అసలేం జరిగిందంటే బిహార్‌కు చెందిన దిలీప్ అనే దొంగ పులివెందుల నియోజకవర్గంలో బైకుపై వెళ్తూ మహిళల మెడల్లో బంగారు గొలుసులు లాక్కెళ్లాడు. దీనిపై సింహాద్రిపురం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. దొంగ వాడిని బైకుపై ఆరా తీసిన పోలీసులు దాన్ని అమ్మిన వారిని విచారించారు. అనంతపురం జిల్లా కదిరికి చెందిన కొందరు ఫైనాన్స్ సంస్థల నిర్వాహకులు, ఆటోమొబైల్ కన్సల్టెన్సీ వారిని విచారించారు. హీరో హోండా బైకును రవినాయక్ అనే వ్యక్తి ఈఎంఐలు చెల్లించకపోవడంతో కదిరికి చెందిన ఆరెంజ్ రిటైల్ ఫైనాన్స్ సంస్థ స్వాధీనం చేసుకుని దాన్ని జాకీర్ అనే వ్యక్తికి అమ్మింది. జాకీర్ నుంచి ఆ బైకును అనంతపురానికి చెందిన వెంకట బాలాజీ ఆటో కన్సల్టెన్సీ నిర్వాహకుడు గుర్రం బ్రహ్మం రూ.35,000కు కొనుగోలు చేశాడు. ఈ బైకును అన్ని అగ్రిమెంట్లు రాసుకుని బ్రహ్మం అనే వ్యక్తి రూ. 42,000 కు బిహార్‌కు చెందిన దిలీప్‌కు విక్రయించాడు. దిలీప్ అనే వ్యక్తి ఆ బైకుతో చోరీలు చేస్తున్నారని పోలీసులు గుర్తించారు. ఇపుడు అసలు దొంగను పట్టుకోవాల్సిన పోలీసులు అది వదిలేసి బైకు అమ్మిన ఏజెంట్లను పది రోజుల నుంచి విచారిస్తూ లంచం డిమాండ్ చేయడంతోనే దొరికిపోయారు. దాదాపు ఆరేడుగురు ఏజెంట్లు, ఫైనాన్స్ నిర్వాహకులను సింహాద్రిపురం పోలీస్ స్టేషన్ కు పిలిపించిన ఎస్సై అనిల్ కుమార్ లంచం డిమాండ్ చేశాడు. మొదట రూ. 22 లక్షలు ఇవ్వాలని, తర్వాత రూ. 7 లక్షలకు తగ్గించి చివరకు రూ.3.5 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. గుర్రం బ్రహ్మం అనే వ్యక్తి రూ. 2 లక్షలు, మిగిలిన ఏజెంట్లు కలిసి 1.5 లక్షలను ఎస్సైకి ఇచ్చే విధంగా అంగీకారం కుదిరింది. గుర్రం బ్రహ్మం రూ.50,000 ఎస్సై కి అందజేశాడు. ఇందులో ఒక లక్ష రూపాయలను ఏజెంట్లు అందజేశారు. మిగిలిన డబ్బు తర్వాత ఇవ్వాలని వేధించడంతో గత్యంతరం లేని స్థితిలో గుర్రం బ్రహ్మం కడప ఏసీబీ అధికారులను ఆశ్రయించగా అసలు నిజం వెలుగు చూసింది. "ఇవాళ సింహాద్రిపురం పోలీస్ స్టేషన్లో 1.5 లక్షల నగదు ఎస్సై అనిల్ కుమార్‌కు బాధితుడు గుర్రం బ్రహ్మం ఇస్తుండగా మేము వారిని గమనించి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నాం. సీఐ వెంకటరమణను కూడా అక్కడికి రప్పించి అదుపులోకి తీసుకున్నారు. వారిని లోతుగా విచారణ జరిపి అదుపులోకి తీసుకున్నాం. ఇద్దరు పోలీసు అధికారులను కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తాం" అని కడప ఏసీబీ డీఎస్పీ సీతారామరావు తెలియజేశారు.

## తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత దేవ్ జీ



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణలో నక్సల్ ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన ఇద్దరు అగ్రశ్రేణి నాయకులతో సహా మొత్తం నలుగురు కీలక నేతలు మంగళవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి (దేవ్ జీ), కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి (సంగ్రామ్), తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు (దామోదర్), రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నరసింహారెడ్డి (గంగన్న) హైదరాబాద్‌లో డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. ఈ లొంగుబాటుతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్మూలించబడినట్లేనని పోలీసులు ప్రకటించారు. లొంగిపోయిన నేతలు దశాబ్దాలుగా అజ్ఞాతంలో కొనసాగుతూ పార్టీలో అత్యున్నత స్థాయి బాధ్యతలు నిర్వర్తించారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో ఉన్న దేవ్ జీ, 46 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో ఉన్న మల్లా రాజిరెడ్డి వంటి సీనియర్లు జనజీవన స్రవంతిలోకి రావడం ఉద్యమాన్ని తీవ్రంగా బలహీనపరిచిందని డీజీపీ శివధర్ రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకంలో భాగంగా దేవ్ జీ, మల్లా రాజిరెడ్డిలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహారెడ్డిలకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున రివార్డు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇంకా 11 మంది తెలంగాణకు చెందిన మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని, వారు కూడా లొంగిపోవాలని పిలుపునిచ్చారు. మావోయిస్టు అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్ రావు (గణపతి) అడవుల్లో లేరని, బయట ఎక్కడో ఆశ్రయం పొందుతున్నారని డీజీపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మావోయిస్టు నేత దేవ్ జీ మాట్లాడుతూ, అనారోగ్య కారణాల రీత్యా తాను రహస్య జీవితాన్ని వదిలి బహిరంగ జీవితంలోకి రావాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే, ఇది కేవలం వ్యక్తిగత జీవితం కోసం కాదని, ప్రజల సమస్యలపై చట్టబద్ధమైన పద్ధతుల్లో (లీగల్ ఫ్రేమ్‌వర్క్‌లో) పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు.

# కౌలు రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి




**అనకాపల్లి, పతాకం న్యూస్:** కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణాలు, అన్నదాత సుఖీభవ ఇవ్వాలని డిమాండ్ చేసూ కౌలు రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కౌలు రైతులందరికీ కార్డులు ఇవ్వడంతో పాటు అన్నదాత సుఖీభవ రూ.20 వేల సాయం అందిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లవుతున్నా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ జిల్లాలోకౌలు రైతాంగం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని, రుణాల అందక ,పంట గిట్టుబాటు లేక కౌలును సైతం రాబట్టుకోలేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌలు రైతులను ఆదుకోవడం ప్రభుత్వ కర్తవ్యంగా ప్రభుత్వం భావించి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు కె. రామ సదాశివరావు, నాగిరెడ్డి సత్యనారాయణ, వేగి శివ, ఆడారి రమణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

## మే 10 నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు



**పాడేరు, పతాకం న్యూస్:** స్థానిక మోదకొండమ్మ ఉత్సవాలను ఈ ఏడాది మే నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు మోదకొండమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటినాయుడు ప్రకటించారు. ప్రతి ఏడాది మే నెలలో మోదకొండమ్మ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. అందుకు గాను ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ప్రధాన కార్యదర్శి కిల్లు కోటినాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నేతలు, గ్రామపెద్దలు, వర్తక సంఘం నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల తేదీలకు ప్రధానార్చకుడు సుబ్రహ్మణ్యం ముహూర్తం పెట్టారు. దీంతో మే నెల 10, 11, 12 తేదీల్లో ఉత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటినాయుడు ప్రకటించారు. ఈ ఏడాది ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందరి సహకారంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, వివిధ పార్టీల రాజకీయ నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి అంగన్వాడీల ధర్నా




**అనకాపల్లి, పతాకం న్యూస్:** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ ఉద్యోగులు పోరాట బాట పట్టారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈనెల 25 26 తేదీల్లో రిలేదీక్షలు, వచ్చేనెల 2నచలో విజయవాడ ఆందోళనలకు సంబంధించి సిడిపిఒకు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగశేషు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, మే నెలలో వేసవి సెలవులు ప్రకటిస్తూ జీవో జారీ చేయాలని, పెండింగ్లో ఉన్న 1810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి నేమ్స్ సెంట్రల్‌గా మార్చాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ల పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, అంగన్వాడి ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి ఎన్ వరలక్ష్మి, అధ్యక్షులు కష్ణవేణి, కాసులమ్మ, తనుజ, విజయ, భవాని, వరలక్ష్మి పాల్గొన్నారు.అంతకుముందు స్థానికదొడ్డి రామానాయుడు భవనంలో అంగన్వాడీల సమావేశం నిర్వహించి, ఆందోళనలను విజయవంతం చేయాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు పిలుపునిచ్చారు. ఆందోళనల్లో అంగన్వాడి ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## అప్పన్న ఆలయానికి మూడో స్థానం



**సింహాచలం, పతాకం న్యూస్:** భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల విషయంలో సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవాలయానికి రాష్ట్రంలో మూడో స్థానం లభించింది. ప్రతినెలా దేవాలయాల పరిధిలో తాగునీరు, పారిశుధ్యం, ప్రసాదాల నాణ్యత, క్యూల నిర్వాహణ తదితర అంశాలపై భక్తుల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం అభిప్రాయాలను సేకరిస్తోంది. గత నెల (జనవరి)లో భక్తులు వ్యక్తీకరించిన అభిప్రాయాల ప్రకారం 76 పాయింట్లతో ద్వారకా తిరుమల దేవస్థానం అగ్రస్థానంలో నిలవగా, 75.1 పాయింట్లతో శ్రీకాళహస్తి రెండు, సింహాచలం దేవస్థానం మూడు స్థానాల్లో ఉన్నాయి. ప్రసాదాల రుచి, నాణ్యత విషయంలో 82.8 పాయింట్లతో, పారిశుధ్య నిర్వాహణలో 70.7 పాయింట్లతో సింహాచల దేవస్థానం అగ్రస్థానంలో ఉంది. దర్శనం విషయంలో మూడు, భక్తులకు తాగునీటి సదుపాయం కల్పించడంలో ఐదో స్థానంలో ఉంది.

## నిరుపయోగంగా మార్కెట్ యార్డులు




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** రైతులకు అండగా నిలవాల్సిన మార్కెట్ యార్డులు నిరుపయోగంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు అవుతున్నప్పటికి రైతులు ఆశించిన ప్రయోజనాలు కలగడం లేదన్న విమర్శలున్నాయి. గతంలో మార్కెట్ యార్డులు అంటే రైతులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు అమలు చేసేవారు. రైతు బంధు పథకంలో రైతు ఉత్పత్తులు గిట్టుబాటు ధర వచ్చే వరకు గోదాముల్లో భద్రపరుచుకుంటే ఆరు నెలల వడ్డీ లేని రుణాలు ఇచ్చేవారు. గ్రామాలకు అంతర్గత రోడ్లు, పశు వైద్య శిబిరాలు నిర్వహించేవారు. ఎరువులు, విత్తనాలు లాభాపేక్ష లేకుండా విక్రయించేవారు. రైతులకు ఉపయోగపడే అటువంటి పథకాలు ప్రస్తుతం అమలుకు నోచుకోవడం లేదు. జిల్లాలో అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం, నర్సీపట్నం, పాయకరావుపేట, మాడుగుల నియోజకవర్గాల్లో వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఒక్కొక్క ఏఎంసీకి రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. విధి విధానాలు ప్రకటించకపోవడంతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా అమలుకు నోచుకోలేదు. గతంలో రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ యార్డుల్లోని గోదాముల్లో భద్ర పరిచుకునే వారు. గిట్టుబాటు ధర వచ్చిన తర్వాత రైతులు విక్రయించుకునే అవకాశం ఉండేది. ఏఎంసీలు ద్వారా రైతు బంధు పథకంలో వడ్డీ లేని రుణాలు మంజూరు చేసేవారు. ఉత్పత్తులు విక్రయించుకున్న తర్వాత రుణాలు చెల్లించేవారు. గత పదిహేనేళ్లుగా రైతు బంధు పథకం అమలు కావడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు పథకానికి బడ్జెట్ కేటాయింపులు చేసి, విధి విధానాలు ప్రకటించకపోవడంతో ఈ ఏడాది నిరుపయోగంగా మారింది. మార్కెట్ యార్డుల్లో సెస్సు వసూళ్లు తప్పితే ఇతర ఏ విధమైన రైతు సంక్షేమ పథకాలు అమలు జరగక పోగా, వార్షిక లక్ష్యాలు సాధించడంలో పాయకరావుపేట ఏఎంసీ తప్పితే మిగిలిన అన్ని ఏఎంసీలు లక్ష్య సాధనలో వెనుకంజలో ఉన్నాయి. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 16 వరకు సెస్సు వసూళ్ల లెక్కలు ఈ విధంగా ఉన్నాయి. అనకాపల్లి మార్కెట్ యార్డులో 2025-26లో సెస్సు వసూళ్ల లక్ష్యం రూ.185 లక్షలు లక్ష్యం కాగా, రూ.119.27 లక్షలు మాత్రమే వసూలు చేశారు. నర్సీపట్నం ఏఎంసీ లక్ష్యం రూ.207 లక్షలకు రూ.131.02 లక్షలు మాత్రమే వసూలు చేశారు. ఎలమంచిలి ఏఎంసీలో రూ.225 లక్షలకు రూ.117.55 లక్షలు, చోడవరం ఏఎంసీలో రూ.106 లక్షలకు రూ.59.72 లక్షలు, మాడుగులలో రూ.60లక్షలకు రూ.31.98 లక్షలు వసూలు చేసి లక్ష్య సాధనలో చతికల పడ్డారు. పాయకరావుపేట ఏఎంసీ మాత్రం రూ.184 లక్షలకు రూ.166.18 లు 90 శాతానికి పైగా మార్కెట్ సెస్సు వసూలు చేసి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది.

## స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వినతి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంటాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఆధార్ కార్డు బ్లాక్ ఎత్తివేయాలని కోరుతూ పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్‌కు కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో గత 25 సంవత్సరాలుగా పనిచేసే ఎంతో నైపుణ్యం సాధించిన సుమారు 5000 మంది కాంట్రాక్టు కార్మికులకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఉక్కు యాజమాన్యం తొలగించిందని వివరించారు. భూములు త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులను కూడా తొలగించారని తెలిపారు. స్థానికులకు 75 శాతం ఉపాధి అవకాశం కల్పించాలని రాష్ట్రంలో చట్టం ఉందని, కాంట్రాక్టు టెండర్‌లో నిర్వాసితులకు 50 శాతం అవకాశం కల్పించాలని ఉన్నా, వీటిని పక్కన పెట్టి ఇతర రాష్ట్రాల నుంచి కొత్తవారిని తీసుకొచ్చి ప్లాంట్‌లో పనులు చేయిస్తున్నారని వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కాంటాక్టు కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ (సిఐటియు), మంత్రి రవి (ఎఐటియుసి), భాస్కరరావు (ఐఎన్‌టియుసి), నగేష్, గోపి, వంశీ ఉన్నారు.

## విశాఖ పోర్టు సరికొత్త రికార్డు.. 80 ఎంఎంటి సరుకు రవాణా



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం పోర్టు అథారిటీ తన 92 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో సరికొత్త రికార్డును అందుకుంది. పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, సమర్థవంతమైన నాయకత్వంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేవలం 327 రోజుల్లోనే 80.08 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా నిర్వహించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఫిబ్రవరి 21 నాటికే 80 ఎంఎంటి మార్కును చేరుకోవడం విశేషం. గత ఏడాది ఇదే లక్ష్యాన్ని చేరడానికి 357 రోజులు పట్టగా ఈసారి ఒక నెల ముందే ఈ ఘనత సాధ్యమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 90 ఎంఎంటి లక్ష్యాన్ని చేరుకుంటామన్న ధీమాను పోర్టు అధికారులు వ్యక్తపరుస్తున్నారు. కార్యాచరణ నైపుణ్యం, స్టేక్ హోల్డర్ల మధ్య సమన్వయం, వ్యూహాత్మక మార్పుల వల్లే ఈ వృద్ధి సాధ్యమైందని చైర్మన్ అంగముత్తు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘనత సాధించడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బంది, భాగస్వామ్య సంస్థలందరినీ అభినందించారు. ఇదే ఉత్సాహంతో త్వరలోనే 90 ఎంఎంటి లక్ష్యాన్ని విజయవంతంగా అధిగమిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు ఈ-కార్నర్ ప్రారంభం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం కేంద్రంగా ఆంధ్ర రాష్ట్రంలో పలు జిల్లాల్లో అన్ని తరగతుల ప్రజలకు విశేష సేవలందిస్తున్న కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు అక్కయ్యపాలెం ప్రధాన కార్యాలయం వద్ద ఈ కార్నర్‌ను బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖాతాదారులకు మరిన్ని వినూత్న సేవలందించేందుకు గాను ఏ సమయంలోనైనా బ్యాంకు పని వేళలతో సంబంధం లేకుండా తమ ఖాతాలో నగదును డిపాజిట్ చేయడానికి వీలుగా ఈ కార్నర్ ప్రారంభించామని చెప్పారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శతశాతం అక్షరాస్యత 'అక్షర ఆంధ్ర' లక్ష్యం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా అనకాపల్లి జిల్లాను నూరుశాతం అక్షరాస్యత జిల్లాగా రూపొందించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అక్షర ఆంధ్ర కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత అక్షర ఆంధ్ర అక్షరాస్యత కార్యక్రమంలో బాగంగా 93,056 మంది నిరక్షరాస్యులను నమోదు చేశామన్నారు. వీరికి 9,351మంది వాలంటరీ టీచర్స్ సహకారంతో ప్రతి రోజు తరగతులు నిర్వహిస్తూ, చదవడం, రాయడం, లెక్కలు, డిజిటల్, ఫైనాన్సియల్ అక్షరాస్యతలో బోధన జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నామన్నారు.ఈ నెల 28న పునాది భాషా సంఖ్య పరిజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్ఎటి)పై ప్రీ ఫైనల్ అంచనా పరీక్ష నిర్వహిస్తామన్నారు. జిల్లాలో అన్ని మండల, మునిసిపాలిటీ, పరిధిలో గ్రామ, వార్డ్ సచివాలయాలు, గ్రామాల పరిధిలో నమోదైన నిరక్షరాస్యులకు పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, పంచాయితీ కార్యాలయాలలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు, సాధన పత్రాల పుస్తకంలోని 5 వ మోడల్ పేపర్ లో పరీక్ష నిర్వహించి ప్రతి వాలంటీర్ టీచర్ ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని మండలాల ఎంపిడిఓలు, ఎపిఒలు, ఎపిఎంలు, మున్సిపల్ కమిషనర్లు, సిఎంఎం, ఎపిడి యుసిడిలను సమన్వయం చేసుకోవాలని ల్లా వయోజన విద్యా శాఖ సహాయ సంచాలకులు డి. చిన్నికృష్ణను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సిఇఒ శివ నారాయణమూర్తి, డిఆర్‌డిఎ, డ్వామా పిడిలు శచిదేవి, పూర్ణిమదేవి, డిపిఒ సందీప్, జిఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా, సమన్వయ అధికారి మంజుల వాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మార్చి 25న ఏయూ స్నాతకోత్సవం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం 91, 92వ సంయుక్త స్నాతకోత్సవాన్ని మార్చి 25వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్కే బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. గతంలో దరఖాస్తు చేసిన వారంతా ఈ స్నాతకోత్సవంలో పట్టాలు అందుకోనున్నారు. స్నాతకోత్సవ పట్టాలను స్వీకరించే వారంతా ఉదయం 10 గంటలకు ప్రాంగణానికి చేరుకుని తమకు కేటాయించిన స్థానంలో కూర్చోవాలని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

## రైతు నుంచి లంచం తీసుకుంటూ
# ఏసీబీకి చిక్కిన వీఆర్వో



**భోగాపురం, పతాకం న్యూస్:** మండలంలోని సవరవిల్లి గ్రామ విఆర్ఓ అంబటి పైడి చిట్టిబాబు ఓ రైతు వద్ద నుంచి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎసిబి అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం.. అంబటి పైడి చిట్టిబాబు సవరవిల్లి విఆర్ఒగా విధులు నిర్వహిస్తూ, అమటాం రాయివలస గ్రామానికి కూడా ఇన్‌చార్జ్ విఆర్ఒగా వ్యవహరి స్తున్నారు. అమటాం రాయివలస రెవెన్యూ పరిధిలోని చాకివలస గ్రామానికి చెందిన రైతు లంక నరిసింహులుకు 0.738 సెంట్ల భూమి ఉంది. ఆ భూమి రికార్డుల్లో తన తండ్రి పేరుపై ఉండడంతో, దానిని తన పేరుమీదకు మార్పించేందుకు ఆయన తన అన్న కుమారుడు లంక బంగారునాయుడుకు బాధ్యతలు అప్పగించారు. బంగారునాయుడు గత ఏడాది అక్టోబర్‌లో విఆర్ఒను కలిసి భూమికి సంబంధించిన వివరాలు తెలియజేశారు. అప్పటినుంచి పలుమార్లు కలిసినా పని ముందుకు సాగలేదు. ఆ భూమిని రికార్డుల్లో నమోదు చెయ్యాలంటే లంక నరసింహులు తండ్రి డెత్ సర్టిఫికెట్, ఎఫ్ఎంసి సర్టిఫికెట్ తీసుకు రావాలని విఆర్ఒ చెప్పారు. లేని పక్షంలో ముందుగా రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని. తర్వాత రూ.2.50 లక్షలు ఇవ్వాలని విఆర్ఒ డిమాండ్ చేసినట్లు రైతు బంగారునాయుడు ఆరోపించారు. తాము పేదవాళ్లమని అంత మొత్తాన్ని ఇవ్వలేమని కోరగా, చివరికి రూ.2.40 లక్షలకు ఒప్పందం కుదిరినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో లంక బంగారునాయుడు ఎసిబి అధికారులను ఆశ్రయించగా, ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం లక్ష రూపాయలను రైతు నుంచి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం విఆర్ఒ తీసుకుంటున్న సమయంలో ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని, అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## విస్తృతంగా భూసార పరీక్షలు



**చింతపల్లి, పతాకం న్యూస్:** వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. రైతుల వ్యవసాయ ప్రగతికి సాంకేతిక సహకారం అందించేందుకు ప్రభుత్వం భూసార పరీక్షలు విస్తృతం చేసింది. ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 22 మండలాల్లో వ్యవసాయశాఖ అధికారులు 28,103 మట్టి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపిస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఫలితాలను రైతులకు అందజేసేందుకు కార్యాచరణ ప్రారంభించారు. భూసార పరీక్షలను ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్నది. వైసీపీ ప్రభుత్వ హయాంలో భూసార పరీక్షలు అటకెక్కాయి. వైసీపీ ఐదేళ్ల కాలంలో భూసార పరీక్షలు నిర్వహించలేదు. తాజాగా పొలాల్లో పరీక్షలు చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు నాణ్యమైన పంటలు పండించాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. పంటలకు అవసరమైన సూక్ష్మపోషకాలు భూమిలో ఉండాలి. నేల ఆరోగ్యం, పోషక విలువలు ఏ స్థాయిలో ఉన్నాయని తెలుసుకోవాలంటే భూసార పరీక్షలు చేయించుకోవాలి. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాల ఆధారంగా పోషకాల యాజమాన్యం చేపడితే వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రధానంగా పంట పొలాల్లో సేకరించిన మట్టి పరీక్షించుకోవడం వల్ల భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు రైతులకు తెలుస్తాయి. ఈ భూసార పరీక్షల ఆధారంగా పొలాల్లో నాటిన పంటలకు పోషకాలు(ఎరువులు) పెట్టుకోవడం వల్ల నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## మోడల్ ప్రాజెక్టుగా జర్రకొండ పంచాయతీ ఎంపిక



**పాడేరు, పతాకం న్యూస్:** గిరిజన గ్రామాల్లో ప్రతి కుటుంబానికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఢిల్లీలోని భారత వైద్య పరిశోధన మండలి ఆధ్వర్యంలో హుకుంపేట మండలం జర్రకొండ పంచాయతీని మోడల్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి.కృష్ణమూర్తి నాయక్ తెలిపారు. ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కుసుమ డీఎంహెచ్‌వో కార్యాలయంలో డి.కృష్ణమూర్తి నాయక్‌ను కలిసి ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ముందుగా పంచాయతీలోని ప్రతీ ఇంట్లో కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు నమోదు చేస్తారన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా గర్భిణి, బాలింత, చిన్నారులు, వృద్ధులకు 105 రకాల మందులు, 14 రకాల రక్త, ఇతర పరీక్షలు అందుబాటులోకి తెస్తారన్నారు. వారం రోజుల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. జర్రకొండ పంచాయతీలో ఈ పైలట్ ప్రోగ్రాం తీరును పరిశీలించిన అనంతరం సంతృప్తిగా ఉంటే జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలకు విస్తరింపజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు భాగస్వాములై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఎంఆర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మోహన్‌బాబు యూనివర్సిటీలో విద్యార్థిని ఆత్మహత్య





**విజయనగరం, పతాకం న్యూస్:** తిరుపతిలో సీనియర్ సినీనటుడు మంచు మోహన్ బాబు నిర్వహిస్తున్నఎంబియు యూనివర్సిటీలో బీటెక్ డేటా సైన్స్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని భువన (22) ఆత్మహత్య ఘటన కలకలం రేపింది. తిరుమల పట్టణంలోని సాయితేజ ప్రైవేట్ లేడీస్ హాస్టల్‌లో ఉంటున్న ఆమె, సోమవారం రాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం గమనించిన హాస్టల్ సిబ్బంది వెంటనే ఆమెను నారావారిపల్లి హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలు పుంగనూరు నియోజకవర్గంలోని మంగళంకు చెందిన విద్యార్థి అని పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని చంద్రగిరి సీఐ సురేష్ కుమార్ తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్యకు సంబందించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.ఘటనపై విద్యార్థిని తల్లిదండ్రులకు హాస్టల్ యాజమాన్యం ఆలస్యంగా సమాచారం అందించడం మరింత వివాదాస్పదంగా మారింది. హాస్టల్ వద్ద తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. తమ కూతురి ఆత్మహత్యపై న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంబీయూలో జరుగుతున్న అరాచకాలపై ప్రభుత్వం స్పందించాలంటూ విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రూయ మార్చురికి తరలించారు. ఇటీవలే ఎంబీకే యూనివర్సిటీ నిర్వాహకుడు మోహన్ బాబుపై స్టూడెంట్ యూనియన్ లీడర్స్ కిడ్నాప్ కేసు నమోదు కావడం వివాదస్పదం కావడం గమనార్హం. విద్యార్థిని ఆత్మహత్యపై ఆమె తండ్రి సురేందర్ రెడ్డి స్పందించారు. తన కుమార్తె ఎందుకు బలవన్మరణానికి పాల్పడిందో తెలియడం లేదని.. రూ.17 లక్షల ప్యాకేజ్ తో ఉద్యోగం వచ్చిందని, తమ కష్టాలు తీరుతాయని అనే ఆనందంలో ఉండగా ఇలాంటి విషాద ఘటన జరిగిందని కన్నీరుమున్నీరయ్యారు. తనకు ఇద్దరు కుమార్తెలున్నారని వారిలో మొదటి కుమార్తె భువన కాగా .. రెండో అమ్మాయి హర్షిత అని ఆమె కూడా అదే కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతోందని మృతురాలి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి




**విజయనగరం, పతాకం న్యూస్:** మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలిన, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సమస్యలపై ఈ బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని కోరుతూ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గ్రీవెన్స్ లో కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని చెప్పి మాట తప్పిందని, ఈ ప్రభుత్వం అయినా న్యాయం చేస్తుందని ఆశిస్తే అందుకు భిన్నంగా వర్క్ ఔట్ సోర్సింగ్ విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. వర్క్ ఔట్ సోర్సింగ్ విధానం అమల్లో భాగంగా ఇతర సచివలయాలకు సర్దుబాటు చేసిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ధర్నా కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు బి భాస్కర్ రావు, నాయకులు కుమారి, రామా, రాఘువ, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా ఆణిముత్యాలను వెలికితీయడమే లక్ష్యం



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లా లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి సరైన వేదికను కల్పించడం ద్వారా అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్లుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన క్రీడా పాఠశాల విద్యార్థుల ఎంపిక ప్రక్రియను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు విద్యార్థుల్లోని శారీరక సామర్థ్య, నైపుణ్య పరీక్షలు ఎంపికలు జరుగుతాయని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని చిన్నతనం నుండే గుర్తించి, వారికి శాస్త్రీయమైన శిక్షణ అందించేందుకు ఈ ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. ఎంపికైన క్రీడాకారులకు క్రీడా పాఠశాలల్లో ఉచిత వసతి, పౌష్టికాహారం, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కోచింగ్‌ను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ రావు, జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, అధికారులు, క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ లంగ్స్ 3.0 పేరుతో
# జీవీఎంసీ స్పెషల్ డ్రైవ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సెల్లార్‌లలో ఆక్రమణల తొలగింపునకు 'ఆపరేషన్ లంగ్స్ 3.0' పేరుతో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. నగరంలో పలుచోట్ల వాణిజ్య భవనాల సెల్లార్లలో ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. ఫుట్‌పాత్‌లు, సెల్లార్‌ల ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ఫిర్యాదులు అందుతుండడంతో స్పెషల్‌డ్రైవ్‌కు కమిషనర్ ఆదేశించారు. సెల్లార్లలో కేవలం వాహనాల పార్కింగ్ మాత్రమే జరిగేలా చూడాలని, ఇతర అవసరాలకు వాడుతున్నట్టయితే నిర్మాణాలను తొలగించాలని స్పష్టంచేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు సీసీపీ ప్రభాకరరావు ఆధ్వర్యంలో సౌత్ జోన్‌లోని 31వ వార్డు పరిధి డాబాగార్డెన్స్‌లో ఒక వాణిజ్య భవనం, 17వ వార్డు (ఈస్ట్‌జోన్) పరిధి ఎంవీపీ కాలనీ సెక్టార్-1లో ఒక అపార్టుమెంట్, 90వ వార్డు (వెస్ట్‌జోన్) గవరవీధిలో రెండు దుకాణాలు, 91వ వార్డు బుచ్చిరాజుపాలెం మెయిన్‌రోడ్డులో ఒక అపార్టుమెంట్, గాజువాక మెయిన్‌రోడ్డు, 66వ వార్డు పరిధిలో షాపింగ్‌మాల్స్ సెల్లార్‌లలో షట్టర్లు, గోడలను తొలగించి పార్కింగ్‌కు వినియోగించేలా చర్యలు తీసుకున్నారు. ఇకపై కూడా సెల్లార్లలో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని సీసీపీ స్పష్టంచేశారు.

## గడువులోగా వినతులు పరిష్కరించాలి: కలెక్టర్



**విజయనగరం, పతాకం న్యూస్:** పిజిఆర్ఎస్ వినతులు గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఎం.రాం సుందర్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. అడిట్ రిపోర్టులు పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని, ఏకకృత కుటుంబ సర్వే వేగవంతం చేయాలని, అన్నాకాంటీన్లలో ఆహార నాణ్యత పెరగాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పలు అంశాలపై జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిజిఆర్ఎస్ వినతులను రెండు పూటలా లాగిన్‌లో తనిఖీ చేయాలని, రెవిన్యూ పిటిషన్లు కు సంబంధించి తహశీల్దార్లు వ్యక్తిగతంగా హాజరు కావాలని అన్నారు. వినతులకు సంబంధం లేని, అనవసరమైన సమాధానాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఐవిఆర్ఎస్ లో తమ శాఖలకు సంబంధించిన ప్రజాభిప్రాయం పై పోజిటివ్ రెస్పాన్సు రావాలని, ఆయా శాఖల వారు తమ పనితీరును సరిదిద్దుకోవాలని తెలిపారు. అధికారులు తప్పనిసరిగా నెలకు 4 సచివాలయాలను సందర్శించాలని, ఏకీకృత కుటుంబ సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. అన్నా కాంటీన్లు, బిసి వెల్ఫేర్ హాస్టళ్లు, ఇరిగేషన్, హెల్త్, ట్రైబల్ వెల్ఫేర్, పౌర సరఫరాల తదితర శాఖలు తమ పని తీరు మెరుగుపరచుకోవాలని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ మురళి, సిపిఒ బాలాజీ, జిల్లా అదికారులంతా పాల్గొన్నారు.పిజిఆర్ఎస్‌కు 232 వినతులు పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్‌లలో ప్రజలు అందించిన అర్జీలపై నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఇ.మురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్‌కు 232 వినతులు అందాయి. డిఆర్ఒ జె.మురళి, ఆర్‌డిఒ కీర్తి, ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ అర్జీ దారులతో నేరుగా మాట్లాడి సమస్యల పంచుకోవడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## మత్స్యకార కుటుంబాలకు రూ.5 లక్షలు ఇవ్వాలి

**విజయనగరం, పతాకం న్యూస్:** బంగ్లాదేశ్ చెరలో మూడునెలల పాటు బందీలుగా ఉండి ఇటీవల స్వగ్రామాలకు చేరుకున్న భోగాపురం , పూసపాటిరేగ మండలాలకు చెందిన 9 మంది మత్స్యకారులకు ఐదు లక్షల చొప్పున ఆర్థిక సహకారం చేయాలని కోరుతూ కొండ్రాజుపాలెం సర్పంచ్ ఎస్. చిన్నారావు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం గ్రీవెన్స్‌లో డిఆర్ఒ మురళీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.జగన్మోహన్‌రావు, ఎస్. కొండ్రాజుపాలెం సర్పంచ్ చిన్నారావు మాటాడుతూ అక్టోబర్ 12న వేట నిమిత్తం వెళ్లిన మత్స్యకారుల సాంకేతిక లోపం కారణంగా బంగ్లాదేశ్ బోర్డర్ క్రాస్ అయ్యారని, అక్కడి కోస్ట్ గార్డ్స్ 9 మంది మత్స్యకారులను అరెస్టు చేసి జైల్లో నిర్బంధించారని తెలిపారు. గత 4 నెలలూ ఉపాధి లేదని, ప్రస్తుతం మరో మూడు నెలలు వేట నిషేధ కాలం కావడంతో ఆ తొమ్మిది కుటుంబాలు పూర్తిగా రోడ్డు ను పడ్డాయని, వారికి కేవలం తక్షణ సహాయం కింద ప్రభుత్వం ఇచ్చిన 10వేలు సరిపోదని అన్నారు. గత ప్రభుత్వం పాకిస్థాన్‌లో చిక్కుకున్న 23 మందికి ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించిందని, ఈ ప్రభుత్వం కూడా ఆ విధంగా ఇవ్వాలని డిఆర్ఒకి విజ్ఞప్తి చేసారు. డిఆర్ఒ స్పందిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారని తెలిపారు.

## సహించే ప్రసక్తే లేదు: అనిత

(మొదటిపేజీ తరువాయి)

తగ్గాయని, పోక్సో కేసులు 8 శాతం, మహిళలపై హత్యలు 45శాతం, సామూహిక అత్యాచారాలు 64 శాతం తగ్గాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలు లేవు కాబట్టే పెట్టుబడులు, పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని, బయటకు వచ్చిన మహిళ తిరిగి ఇంటికి వెళ్తుందో లేదో తెలియని దుస్థితి ఉండేదని అనిత విమర్శించారు. గత ప్రభుత్వం ప్లాన్ ఆఫ్ ఆక్షన్ ఇవ్వకపోవడం వల్ల రూ. 180 కోట్ల కేంద్ర నిధులు కోల్పోయామని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల టీడీపీ ఎమ్మెల్యే ఇంట్లో దొంగతనం కేసులో వైసీపీ గ్రామ సర్పంచ్ అరెస్టయ్యారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ప్రస్తుత ప్రభుత్వం రాజకీయాల కోసం వాడకోవడం లేదని, అందువల్లే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 25 శాతం తగ్గాయని అనిత పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నామని, ఇప్పటివరకు 96,940 కేజీల గంజాయి సీజ్ చేశామని తెలిపారు. అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబోలేటరీ భవన నిర్మాణాన్ని జగన్ ఆపేశారని, తాము ఫోరెన్సిక్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 'రప్పా.. రప్పా.. నరుకుతాం' అని శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ రెచ్చగొట్టేలా మాట్లాడితే కేసు ఫైల్ చేశామని, వైసీపీ కార్యకర్తలు అసభ్యంగా మాట్లాడితే దాన్ని జగన్ సమర్థించడం దారుణమని అన్నారు. గీత దాటి రెచ్చ గొడుతూ మాట్లాడినా చూస్తూ ఊరుకునేందుకు ఇక్కడ సీఎంగా ఉన్నది జగన్ కాదని, చంద్రబాబు అని అనిత పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు చేసిన ఆరాచకాల ఫలితంగానే వారు 151 నుంచి 11 సీట్లకు దిగజారారని విమర్శించారు.

# సోనార్ బంగ్లా సాకారం.. బెంగాల్ ప్రజలకు మోడీ బహిరంగ లేఖ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బెంగాల్ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది నెలరోజుల్లో బెంగాల్ భవితను నిర్ణయించే కీలక ఎన్నికలు జరుగనున్నాయని, భావితరాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రజలు వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బంగారు బంగ్లా కలల సాకారానికి తాను భరోసా ఇస్తున్నానని అన్నారు. 'జై మహాకాళి' అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. 'మరి కొద్ది నెలల్లోనే బెంగాల్ భవిష్యత్తు నిర్ణయం కోబోతోంది. మీరు తీసుకునే తెలివైన నిర్ణయం పైనే భావితరాల భవిష్యత్తు, దిశానిర్దేశం ఆధారపడి ఉంటుంది. సోనార్ బంగ్లా కోసం యువకులు, పెద్దలు, మహిళలు కన్న కలలు కల్లలుగా మిగిలిపోతున్న పరిస్థితి ఇవాళ ఉంది. వారి బాధలు నన్ను కలిచివేస్తున్నాయి. ఇందుకోసం హృదయపూర్వకంగా ఒక తీర్మానం చేసుకున్నాను. వికసత్ బంగ్లా సాధనకు నిర్ణయం తీసుకున్నాను' అని ఆ లేఖలో మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీస్సుల బలంతో ప్రజాసంక్షేమానికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పాటుపడిందని, రైతుల సంక్షేమం నుంచి యవత కలల సాకారం, మహిళా సాధికారత వరకూ కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల సాధించిన సానుకూల ఫలితాలను ఇవాళ ప్రజలు చూస్తున్నారని అన్నారు. బెంగాల్ అభివృద్ధి విషయంలో మమతాబెనర్జీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందని మోదీ ఆ లేఖలో విమర్శించారు. అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి కట్టుబడి కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. 'జన్-ధన్ యోజన'తో పశ్చిమబెంగాల్‌లోని సుమారు 5 లక్షల మందికి బ్యాంకు అకౌంట్లు తెరిచామని, స్వచ్ఛభారత్ అభియాన్ కింద 85 లక్షల టాయిలెట్లను రాష్ట్రంలో నిర్మించామని చెప్పారు. చిన్న వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ.2.82 లక్షల కోట్లు రుణాలిచ్చామని, 56 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు అటల్ పెన్షన్ యోజన కింద లబ్ధి చేకూర్చామని, ఉజ్వల్ యోజన కింద కోటికి పైగా ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించామని వివరించారు.

# వెంటనే ఇరాన్ నుంచి బయటపడండి... భారతీయులకు కేంద్రం అలర్ట్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఇరాన్‌లో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడున్న భారత పౌరులకు కేంద్ర ప్రభుత్వం కీలక సూచనలు జారీ చేసింది. ఇరాన్‌కు, అమెరికాకు మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్నందున, వీలైనంత త్వరగా దేశం విడిచి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరింది. ఈ మేరకు టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఓ అత్యవసర ప్రకటన విడుదల చేసింది. ఇరాన్‌లో నివసిస్తున్న విద్యార్థులు, తీర్థయాత్రికులు, వ్యాపారులు, పర్యాటకులు సహా ప్రతీ ఒక్కరూ అందుబాటులో ఉన్న వాణిజ్య విమానాలు లేదా ఇతర రవాణా మార్గాల ద్వారా తక్షణమే దేశం విడిచి వెళ్లాలని రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఇరాన్‌పై అమెరికా సైనిక దాడులకు దిగే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే జనవరి 5, 14 తేదీల్లో జారీ చేసిన సలహాలకు కొనసాగింపుగా ఈ తాజా హెచ్చరిక జారీ చేసినట్లు పేర్కొంది.

# కల్తీ నెయ్యి కేసులో సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసుపై ఏపీ ప్రభుత్వం వేసిన ఏకసభ్య కమిటీని సవాల్ చేస్తూ సుబ్రహ్మణ్యస్వామి వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టి వేసింది. ఏకసభ్య కమిటీ ఏర్పాటు తప్పు కాదని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్‌లాపింగ్ కిందకు రాదని వెల్లడించింది. పరిపాలనాపరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటుచేసిందని వివరించింది. రాజ్యాంగ పదవుల్లోనివారు ఈ వ్యవహారంపై మాట్లాడకుండా నిలువరించాలని సుబ్రహ్మణ్య స్వామి తరఫు న్యాయవాది వినతిని కోర్టు తోసిపుచ్చింది . కోర్టు పరిధిలో ఉన్నందున ప్రభావం చూపే పరిస్థితి లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయడం సిట్ దర్యాప్తునకు వ్యతిరేకం కాదని వివరించింది. పిటిషనర్ వ్యక్తం చేసిన అనుమానాలకు ఆధారాలు లేవని పేర్కొంది. రెండుకార్యక్రమాలు చట్టపరంగా కొనసాగాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు వేసిన సిట్ నివేదిక ఆదారంగా ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

# 'ఏఐ4 ఏపీ పోలీస్' - 3 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు




**అమరావతి, పతాకం న్యూస్:** పోలీసింగ్‌లో ఏఐ (కృత్రిమ మేధ) వినియోగాన్ని మరింత పెంచేందుకు ఏపీ పోలీస్ శాఖ 'ఏఐ 4 ఏపీ పోలీస్' ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. సంప్రదాయ విధుల నుంచి డేటా, సాక్ష్యాల ఆధారిత, ఏఐ సహాయ పోలీసింగ్ వైపు మళ్లేందుకు వీలుగా ఈ ప్రాజెక్టులో 8 ఏఐ మాడ్యుల్స్?ను సిద్ధం చేసింది. ఇప్పటికే అన్నమయ్య, చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. వచ్చే 6 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నారు. డీజీపీ హరీష్?కుమార్ గుప్తా చొరవతో సాంకేతిక సేవల విభాగం ఐజీ సీహెచ్ శ్రీకాంత్ పర్యవేక్షణలో 'ఏఐ 4 ఏపీ పోలీస్' ప్రాజెక్టు సిద్ధమైంది. ఈ మాడ్యూల్ బాధితుల ఫిర్యాదుల్లోని సారాంశాన్ని సంగ్రహించి ఉన్నతాధికారులకు అందిస్తుంది. క్షేత్రస్థాయి సిబ్బంది సరిగ్గా విచారించారా? విచారణ నివేదిక సమగ్రంగా ఉందా? లోపాలు ఏమైనా ఉన్నాయా? అవేంటి? అవసరమైన పత్రాలు అన్నీ పొందుపరిచారా? వంటి అంశాలు వేగంగా సమీక్షించేందుకు, నాణ్యత మదించడానికి, లోపాలను సరిదిద్దేలా క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు ఇవ్వడానికి ఉపయోగపడుతుంది. మాన్యువల్?గా ఒక్కో విచారణ నివేదిక సమీక్షకు 30 నుంచి 45 నిమిషాలు పడుతుండగా, ఆ మాడ్యూల్ ద్వారా 5 నుంచి 10 నిమిషాలు చాలు. ఫోన్ కాల్ డీటెయిల్ రికార్డులు, ఐపీడీఆర్‌లు, టవర్ డేటా కోసం దర్యాప్తు అధికారులు వివిధ టెలికాం ఆపరేటర్లకు, ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు అకౌంట్ల సమాచారం కోసం బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, వివిధ ఈ కామర్స్ సంస్థలకు చట్ట ప్రకారం నోటీసులు ఇస్తుంటారు. కేసు వివరాలు, కావాల్సిన సమాచారం పొందుపరిస్తే చాలు, ఏ విభాగానికి ఎలా నోటీసులు ఇవ్వాలో ఈ మాడ్యుల్ ఓ ఫార్మాట్‌ను సిద్ధం చేసి దర్యాప్తు అధికారికి ఇస్తుంది. వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి, కేసుతో అనుసంధానిస్తుంది. నోటీసుల జారీ, స్వీకరణకు ఓ నోడల్ అధికారిగా ఉపయోగపడుతుంది. కాల్ డీటెయిల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, ఐపీడీఆర్‌లు, ఫుడ్ డెలివరీ రికార్డులు, పేమెంట్ గేట్‌వేలు, టవర్ డంప్, సహా ఇతరత్రా వనరుల నుంచి సేకరించిన సాంకేతిక ఆధారాలు అన్నింటినీ విశ్లేషించి వాటిల్లో నుంచి దర్యాప్తు అధికారికి కావాల్సిన సమాచారాన్ని వెలికి తీస్తుంది. ఉదాహరణకు ఓ అనుమానితుడికి సంబంధించి వివిధ రూపాల్లో వచ్చిన సమాచారాన్ని విశ్లేషించి 'ఫిబ్రవరి 2న మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య అనుమానితుడు 3 వ్యక్తులతో మాట్లాడాడు. లొకేషన్ డేటా విశ్లేషణలో అతను విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్నట్లుగా ఉంది అని సులువుగా అర్థం అయ్యే రీతిలో సమాచారం ఇస్తుంది. అనుమానితుల ప్రవర్తనను విశ్లేషిస్తుంది. కేసుల దర్యాప్తు, నేరాల ఛేదనకు ఇది కీలకం. ఫిర్యాదు స్వీకరణ, కేసు నమోదు, దర్యాప్తు, ఆధారాల సేకరణ, కేసు డైరీ, ఛార్జ్ షీట్ తయారీ వరకు కూడా ప్రతి దశలోనూ దర్యాప్తు అధికారికి ఈ టూల్ సహాయపడుతుంది. ఫిర్యాదులోని తీవ్రత, నేర అంశాలను గుర్తించి, ఆ కేసుకు వర్తించే చట్టాలు, సెక్షన్ల సమాచారాన్ని ఇస్తుంది. ఆయా కేసుల దర్యాప్తునకు నిర్దేశించిన ప్రామాణిక పద్ధతుల ప్రకారం కేసు డైరీ, ఛార్జ్‌షీట్ ఉందా? ఆ మేరకు ఆధారాలు సేకరించారా? అని పరిశీలిస్తుంది. తద్వారా విచారణలో లోటుపాట్లను సరిదిద్దుకొని సమగ్ర నివేదికను కోర్టులో సమర్పించవచ్చు. దోషులు తప్పించుకునే వీలు లేకుండా పక్కా సాక్ష్యాధారాలతో కేసును నిలబెట్టి, శిక్ష పడేలా చేస్తుంది. సాంకేతిక కారణాలతో కేసు వీగిపోయే అవకాశాలను తగ్గిస్తుంది. పోలీస్ ఉద్యోగుల సర్వీసు రికార్డులు, బదిలీ ఆర్డర్లు, శిక్షణ సర్టిఫికెట్లు, ఏసీఆర్‌లు, మెడికల్ రికార్డులు తదితర పర్సనల్ డాక్యుమెంట్లు అన్నీ ప్రస్తుతం కాగితాల్లో ఉన్నాయి. అవసరమైనప్పుడు వాటిని వెతుక్కోవడం పెద్ద పని. ఈ ఏఐ టూల్‌తో వాటన్నింటినీ డిజిటలైజ్ చేస్తారు. ఏ ఉద్యోగి సమాచారమైనా ఉన్నతాధికారులు క్షణాల్లో తెలుసుకోవచ్చు. వివిధ వాట్సప్ గ్రూపుల్లో పోటెత్తే మెసేజ్‌ల్లో పోలీసులకు అవసరమైనవి గుర్తించి, వాటిని అంశాల వారీగా వర్గీకరించి సంబంధిత జిల్లా, సబ్ డివిజన్, పోలీస్ స్టేషన్లకు పంపించేందుకు ఈ మాడ్యూల్ ఉపయోగపడుతుంది. ఆందోళనలు, ఆర్థిక మోసాలు, నేరాలు, శాంతి భద్రతల సమస్యలకు దారి తీసే మెసేజ్‌లను వడ పోసి, ఆయా విభాగాలను పర్యవేక్షించే అధికారులకు పంపించి వారిని అప్రమత్తం చేస్తుంది. తద్వారా పోలీసులు నేర నియంత్రణ, శాంతి భద్రతల రక్షణకు సత్వరమే స్పందించవచ్చు. న్యూస్ పేపర్స్, న్యూస్ వెబ్‌సైట్లు, డిజిటల్ మీడియా వేదికలో వేర్వేరు భాషల్లో వచ్చిన వార్తలను అనువదించి, విశ్లేషించి, వాటి సారాంశాన్ని సంక్షిప్తంగా సిద్ధం చేసి అందిస్తుంది. ఒక అంశానికి సంబంధించిన వార్తలు అన్నింటినీ ఒకే చోట క్రోడీకరించడం, లింక్ చేయడం ఈ మాడ్యూల్ పని. ఆయా వార్తల్లోని వ్యక్తులు, సంస్థలకు ఏవైనా నేరాల్లో సంబంధముంటే పసిగట్టి అప్రమత్తం చేస్తుంది. ఈ సమాచారాన్ని పోలీసులు ఆటోమేటెడ్ న్యూస్ ఇంటెలిజెన్స్‌గా వాడుకుంటారు. ఏఐ ఎకోసిస్టమ్‌కు ఇది వెన్నుముకలా పని చేస్తుంది. ప్రాంప్ట్ మేనేజ్‌మెంట్, అబ్జర్వబిలిటీ, యాక్సెస్ కంట్రోల్, సెంట్రలైజ్డ్ అథెంటికేషన్ సహా రీయూజబుల్ ఏఐ బిల్డింగ్ బ్లాక్స్ అందిస్తుంది. డేటా సెక్యూరిటీకి హామీ ఇస్తుంది. కొత్త ఏఐ యూజ్ కేసుల తయారీకి దోహదపడుతుంది.

'ఏఐ 4 ఏపీ పోలీస్' ప్రాజెక్టు అమలుతో కేసుల దర్యాప్తునకు పట్టే సమయం తగ్గుతుందని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. దర్యాప్తులో నాణ్యత మెరుగై, శిక్షల శాతం పెరుగుతుందన్నారు. పోలీసుల సాధారణ విధులు, రోజువారీ పనులకు సమయం తగ్గుతుందని చెప్పారు. తద్వారా వారు అత్యంత ముఖ్యమైన అంశాలపై, మెరుగైన పౌర సేవలపై దృష్టి పెట్టేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని వెల్లడించారు.

# సంక్షోభంలో సచివాలయాల వ్యవస్థ: పీపుల్స్ పల్స్ సర్వే

**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందని పీపుల్స్ పల్స్ సంస్థ వెల్లడించింది. ఈ వ్యవస్థపై నిర్వహించిన సర్వే ఫలితాలను సంస్థ సోమవారం విడుదల చేసింది. ఈ సర్వేను 2025 డిసెంబరు 1 నుంచి 2026 జనవరి 20 మధ్య నిర్వహించినట్లు, ఇచ్ఛాపురం నుంచి తడ వరకూ, రాయలసీమ, అదేవిధంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లోను సందర్శించినట్లు పేర్కొంది. 15 వేల కంటే ఎక్కువ సచివాలయాలు స్థాపించి, 1.34 లక్షలకుపైగా సిబ్బంది, 2.52 లక్షల మంది వాలంటీర్లతో ప్రారంభమైన ఈ వ్యవస్థ తొలినాళ్లలో స్పష్టమైన ప్రయోజనాలను అందించిందని పేర్కొంది. 1.10 లక్షల మంది ఉద్యోగులు వారానికి 48 గంటలకుపైగా పని చేస్తున్నారని, నిధుల లేమి, అంతులేని సర్వేలు, ముఖ గుర్తింపు హాజరు, రాజకీయ జోక్యం విస్తృత నిరాశకు దారితీసినట్లు వెల్లడిచింది. ఒక్క గత ఏడాది (2025)లో 10 మంది సచివాలయ సిబ్బంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు చెప్పారు. 2024లో వాలంటీర్ల వ్యవస్థను అకస్మాత్తుగా రద్దు చేయడం వల్ల ప్రభుత్వ సేవలు ప్రజల ఇంటి ముంగిటకు చేర్చే విషయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ఒకప్పుడు ప్రజలు కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది కాదని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. హామీ ఇచ్చిన విధంగా వినతులపై 72 గంటలలోపు పరిష్కారం అవడం లేదని, సచివాలయాలు సమస్యల పరిష్కార కేంద్రాలుగా కాకుండా కేవలం దరఖాస్తుల సేకరణ కేంద్రాలుగా పని చేస్తున్నాయని పేర్కొంది. అనేక సచివాలయాల్లో మౌలిక సదుపాయాలు, కనీస సౌకర్యాలు లేవని తెలిపింది.పీపుల్స్ పల్స్ సంస్థ సచివాలయాల వ్యవస్థను చక్కదిద్దేందుకు ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు చేసింది. వాటిలో ముఖ్యంగా రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యావేత్తలు, విశ్రాంత ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన 15 రోజుల్లో ఉన్నత స్థాయి స్వతంత్ర అధ్యయన కమిటీ ఏర్పాటు చేయాలని, 3 నెలల కాలపరిమితితో నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. జనాభా




ఆధారిత సిబ్బంది హేతుబద్దీకరణ పూర్తి చేయాలని పేర్కొంది. రాజకీయం లేని వాలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించాలని, వీరికి నెలకు రూ.10 వేల గౌరవ వేతనం, వారి పాత్రపై స్పష్టత ఇవ్వడంతో పాటు ప్రతి 100 ఇళ్లకు ఒకరిని నియమించాలని సూచించింది. మహిళా సిబ్బందికి అనువైన పనిగంటలు, జిల్లా స్థాయిలో గోప్యంగా కౌన్సిలింగ్ సేవలు, అర్హతల ఆధారంగా పదోన్నతలు కల్పించాలని పేర్కొంది. పంచాయతీరాజ్ సంస్థలతో ఏకీకరణకు బలోపేతం చేయడం, మౌలిక సదుపాయలు, డిజిటల్ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని కోరింది.

# రూ.3.31 లక్షల నకిలీ సిగరెట్లు పట్టివేత

**సత్తెనపల్లి పతాకం న్యూస్:** సత్తెనపల్లి పట్టణంలో భారీగా నకిలీ సిగరెట్లు పట్టుకున్నారు. వడ్డవల్లి ఆంజనేయ స్వామి ఆలయం వెనుక బజార్‌లోని 15వ వార్డుకు చెందిన వ్యాపారి నోముల కోటేశ్వరరావు ఇంట్లో విజిలెన్స్ -- ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు రాత్రి తనిఖీ చేశారు. బిల్లులు లేని, నాసిరకం సిగరెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జిటిపిఎల్ విమల్, డిజిఆర్‌యుఎం బ్లాక్, గోల్డ్ విమల్, గోల్డ్ సాండ్, పలాన్స్‌ను స్వాధీనం చేసుకోగా వీటి విలువ రూ.3.31లక్షలని అధికారులు తెలిపారు. వీటిపై వ్యాపారిని ప్రశ్నించగా పట్టణలోని ఉయ్యూరు సుబ్బారావు గుప్తా వీటిని కొనుగోలు చేస్తున్నట్లు కోటేశ్వరరావు అంగీకరించారు. దీంతో ఇద్దరిపైనా కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్స్పెక్టర్ కే. చంద్రశేఖర్, అసిస్టెంట్ జియలజిస్ట్ అనిల్‌బాబు, సబ్ ఇన్స్పెక్టర్ అమీర్, విఆర్ఒ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.



## తమిళనాడు ఎస్ఐఆర్ తుది జాబితా విడుదల.. 74 లక్షల మంది ఓటర్ల తొలగింపు



**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పూర్తికావడంతో తుది జాబితాను ఎన్నికల సంఘం సోమవారంనాడు విడుదల చేసింది. సవరించిన జాబితా కింద రాష్ట్రంలోని 74 లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి ఈసీ తొలగించింది. మొత్తం 5.67 కోట్ల మంది ఓటర్ల బాజితాలో చోటుచేసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ముందు 6.41 కోట్ల మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారు. సోమవారంనాడు చెన్నైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తమిళనాడు చీఫ్ ఎలక్షన్ అధికారి అర్చనా పట్నాయక్ ఈ జాబితాను విడుదల చేశారు. తాజా జాబితాలో 5.67 కోట్ల మంది ఓటర్లు నమోదు కాగా, వీరిలో 2.77 కోట్ల మంది పురుషులు, 2.89 కోట్ల మంది మహిళలు 7,617 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. క్లెయిమ్‌లు, అబ్జెక్షన్ పీరియడ్‌లో దాఖలు చేసిన దరఖాస్తులను సమీక్షించి మార్పులు చేసినట్టు ఎన్నికల కమిషన్ తెలిపింది. 2025 డిసెంబర్ 19 నుంచి 2026 జనవరి 30 వరకూ ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించాల్సిందిగా 4.38 లక్షల అప్లికేషన్లు వచ్చాయని, వీటిలో 4.23 లక్షల ఎంట్రీలను వెరిఫికేషన్ అనంతరం తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించామని పేర్కొంది. కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఈ వేసవి సీజన్‌లోనే జరగనున్నాయి. కేరళ, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, అస్సాం ఎన్నికలు కూడా ఇదే పీరియడ్‌లో జరగాల్సి ఉన్నాయి.

## తోటి విద్యార్థినితో మాట్లాడిందని చితకబాదిన ప్రిన్సిపల్

**పల్నాడు జిల్లా, పతాకం న్యూస్:**తోటి విద్యార్థినితో మాట్లాడడాన్ని సహించలేని ప్రిన్సిపల్ విచక్షణ మరచి ఆ విద్యార్థిని చితకబాదాడు. ఈ ఘటన పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జరిగింది. బాధిత తల్లిదండ్రుల వివరాల మేరకు... నరసరావుపేట పట్టణానికి చెందిన షేక్ బషీరా అనే విద్యార్థిని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నారు. ం తరగతి గదిలో మరో విద్యార్థినితో బషీరా మాట్లాడడాన్ని సిసి కెమెరాలో చూసిన ప్రిన్సిపల్ శంకర్‌రెడ్డి... బషీరాను తన గదికి పిలిపించుకుని చితకబాదాడు. జుట్టు పట్టుకుని చెంపలు వాయిస్తూ, వీపుపై కొట్టారని బాధిత విద్యార్థిని వాపోయారు. విషయం తెలిసిన విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ప్రిన్సిపల్‌ను ప్రశ్నించారు. నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడంతో విద్యార్థినితోపాటు తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ నాయకులు స్కూల్ ఎదుట ధర్నాకు దిగారు.

## న్యాయవాదులపై దాడులు జరగటం బాధాకరం



**నందిగామ, పతాకం న్యూస్:** న్యాయ వ్యవస్థను కాపాడే న్యాయవాదులపై తరచూ దాడులు జరగటం చాలా బాధాకరమని నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్ పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరుతూ నందిగామ బార్ అసోసియేషన్ విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ .... కర్నూలు బార్ అసోసియేషన్ సభ్యులు ఎం పవన్ కుమార్ పై విక్రమ్ సింహ అనే సిఐ దాడి చేయటం పట్ల తీవ్రమైన నిరసనలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని తక్షణం సిఐ పై చట్టపరమైన చర్యలు తీసుకొని అతడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో న్యాయవాదులకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించాలని, న్యాయం కోసం నిరంతరం శ్రమించే న్యాయవాదులపై హత్యలు, దాడులు జరగటం వలన న్యాయవాదుల ఆత్మ ధైర్యం దెబ్బతింటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు, సీనియర్ కౌన్సిల్ సభ్యులు చావలి సాంబశివరావు, ఏ సత్యనారాయణ మూర్తి, సీనియర్ న్యాయవాదులు తుర్లపాటి మార్కండేయులు. పెసరమెల్లి సురేష్. షేక్ సైదా, మంగళపూడి ముక్తేశ్వరరావు, ఎ.నాగ నరసింహరావు, యరగొర్ల రామారావు, యరగాని వీరబాబు, ఎక్కిరాల హనుమంత రావు, పంది ప్రకాష్, కొనకంచి శ్రీనివాసరావు, మంద వజ్రయ్య, ఉప్పులూరు జవహార్ బాబు, నారపోగు కోటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, చీ.తారా సింగ్, వేల్పుల కిషోర్, బి.సురేష్, జి.సుమన్. విజయ భాస్కర్, నారా పోగు సురేష్. బబ్బిలిపాటి భాస్కరరావు, ప్రభు జి, కొమ్మినేని మౌలేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**కృష్ణా, పతాకం న్యూస్:** పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలంటూ ఈ నెల 27వ తేదీన చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చల్లపల్లి మండల సిఐటియు కన్వీనర్ మహమ్మద్ కరీముల్లా కార్మికులకు పిలుపునిచ్చారు.స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట చలో కలెక్టరేట్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా పంచాయతీ కార్మికులకు ప్రతినెల 5వ తేదీ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు నెలకు 21 వేల రూపాయలు వాటర్ మాన్లకు 18, 000 వెహికల్ డ్రైవర్లకు రెండు 24 500 రూపాయలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు.

## కర్ణాటకలో కుమ్ములాట.. కేబినెట్ విస్తరణ కోసం 31 మంది ఎమ్మెల్యేలు రాహుల్‌కు లేఖ



**బెంగళూరు, పతాకం న్యూస్:** కర్ణాటకలో నాయకత్వ మార్పు కోసం జరుగుతున్న పోరు మరో మలుపు తిరిగింది. మంత్రివర్గ పునర్వవస్థీకరణలో తమకు చోటు కల్పించాలని కోరుతూ తొలిసారి గెలిచిన 31 మందికి పైగా ఎమ్మెల్యేలు పార్టీ అధిష్టానానికి సోమవారంనాడు లేఖ రాశారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను అడ్రెస్ చేస్తూ ఎమ్మెల్యేలు ఈ లేఖ రాశారు. 'కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీ నుంచి 38 మంది కొత్త వారిని ఎమ్మెల్యేలుగా అసెంబ్లీకి పంపిన విషయం మీకు తెలుసు. తద్వారా అసెంబ్లీలో కొత్త వారిని చూడాలని అనుకుంటున్నట్టు ప్రజలు స్పష్టమైన సందేశాన్నిచ్చారు' అని అధిష్టానానికి రాసిన లేఖలో ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. అయితే మంత్రివర్గంలో 34 మందికి చోటు కల్పించినప్పటికీ కొత్తగా ఎన్నికైన ఒక్క ఎమ్మెల్యేకు కూడా అవకాశం కల్పించలేదని అన్నారు. ఆ దృష్ట్యా తొలిసారి ఎన్నికైన సమర్ధత కలిగిన యువ ఎమ్మెల్యేలకు మంత్రులుగా సేవ చేసే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానానికి రాసిన లేఖపై సంతకాలు చేసిన ఎమ్మెల్యేలలో ఏఎస్ పొన్నన్న, అశోక్ రాయ్, శ్రీనివాస్ ఎన్‌టీ, పి.రవికుమార్, ఏసీ శ్రీనివాస్, హెచ్ఏ ఇక్బాల్ హుస్సేన్, బి.దేవేంద్ర, నారా భరత్ రెడ్డి, విశ్వాస్ వి వైద్య, బసవరాజ్ వి శివగంగ తదితరులు ఉన్నారు.

## భూ సమస్య లేకుండా చూడాలి

**అన్నమయ్య జిల్లా, పతాకం న్యూస్:**గాలివీడు మండలంలో భూ సమస్యలు లేకుండా చూడాలని తహశీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణిలో విఆర్‌ఒలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారని భూసమస్యల పరిష్కారంపై చర్చించారు. గ్రామాలలో భూ సమస్యలు లేకుండా చూడాలని జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సమస్యలు వెళ్లకుండా మండల స్థాయిలోనే గ్రామస్థాలో పరిష్కరించడానికి చొరవ చూపాలని ఆమె పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. వెలిగల్లు, కొర్లకుంట గ్రామాలలో రీసర్వే ఉన్నదని గ్రామాల ప్రజలు రైతులు వెలిగల్లు గ్రామంలో 4700 సర్వే నెంబర్లు కొర్లకుంట గ్రామంలో 3250 సర్వే నెంబర్లు కలవని భూమి ఉన్న ప్రతి రైతు ఆధార్ కార్డుతో పాటు ఆ భూమి కలిగిన పత్రాలను రీసర్వే నోటీసులు ఇచ్చే విఆర్ఒ సర్వేయర్‌కు అందివాళ్ళని పేర్కొన్నారు.

# కాలేయానికి వచ్చే వ్యాధులు!

కాలేయం మనిషికి మంచి మిత్రుడు. తనకు నష్టం కలిగిస్తున్న అలవాట్లు, వ్యాధులను గుర్తించి సరిచేసుకోవడానికి ఎంతో అవకాశం ఇస్తుంది. అయితే కాలేయ కణాలు మొత్తం దెబ్బతిన్నప్పుడు మాత్రం పరిస్థితి పూర్తిగా చేజారిపోతుంది. కాలేయానికి ఉన్న ప్రత్యేక శక్తి కూడా పనికి రాకుండా పోతుంది. కాలేయం రకరకాల వ్యాధుల వల్ల దెబ్బతింటుంది. వ్యాధులు, మద్యపానం వంటి అలవాట్ల వల్ల దెబ్బతిన్నా.. తొలిదశలో యథావిధిగా పనిచేస్తుంది. కానీ, వ్యాధులను నిర్లక్ష్యం చేసినా, నష్టం కలిగించే అలవాట్లను కొనసాగించినా.. లివర్ ఒక్కసారిగా కుప్పకూలిపోతుంది. విపరీతమైన, దీర్ఘకాలపు మద్యపానం (నాలుగైదేండ్ల కన్నా ఎక్కువ), హెపటైటిస్ బి, సి వైరస్ ఇన్‌ఫెక్షన్ల వల్ల ఎక్కువ మందికి కాలేయ వ్యాధులు వస్తున్నాయి. ఈ కారణాల వల్ల మొదట కామెర్ల వ్యాధి సోకుతుంది. వ్యాధిని గుర్తించి వెంటనే చికిత్స చేయించుకోని పక్షంలో అది కాస్తా ముదిరి కాలేయం పనితీరు తీవ్రంగా దెబ్బతింటుంది. వీటిలో హెపటైటిస్ ఎ, ఇ వైరస్‌ల వల్ల వచ్చే కామెర్లు చాలా ప్రమాదకరం. దీనిలో హఠాత్తుగా కామెర్ల వ్యాధి సోకి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. కలుషితమైన నీళ్లు, తిండి వల్ల ఈ తీవ్రమైన హెపటైటిస్ ఎ, ఇ వైరస్‌లు శరీరంలోకి చేరుతుంటాయి. చాలాకాలంపాటు మితిమీరి మద్యపానం చేయటం వల్ల కాలేయం తీవ్రంగా దెబ్బతింటుంది. లివర్ సిరోసిస్ వ్యాధి వస్తుంది. ఊబకాయం కూడా కాలేయ వ్యాధులకు కారణం అవుతున్నది. ఫ్యాట్ సిరోసిస్ లేదా నాన్ ఆల్కహాలిక్ స్టియటోనాష్ ఏర్పడుతుంది. ప్రస్తుతం కాలేయ సమస్యలతో వస్తున్న వారిలో దాదాపు సగం మందిలో ఈ ఫ్యాట్ సిరోసిస్ వ్యాధే కనిపిస్తున్నది. ఫ్యాట్ సిరోసిస్ బి (చివరి), సి చైల్డ్ స్టేజ్‌లో కాలేయ కణాలు చాలా వరకు పనిచేయలేని స్థితికి చేరుకుంటాయి. పిల్లల్లో కనిపిస్తున్న కాలేయ వ్యాధులు చాలా వరకు పుట్టుకతో వస్తున్నవే. శరీర ధర్మక్రియలకు సంబంధించినవే! విల్సన్ డిసీజ్, బైల్ డకట్స్ లేకపోవటం, కణితుల లాంటి సమస్యలు కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ రకమైన సమస్యలు ఉన్న పిల్లలకు భవిష్యత్తులో కాలేయం పూర్తిగా పనిచేయలేని స్థితికి చేరుకుంటుంది. వ్యాధులతో కాలేయం దెబ్బతినటం అత్యంత ప్రమాదకరమైన అనారోగ్య పరిస్థితిని సృష్టిస్తుంది. అయితే అది వ్యాధుల బారినపడకుండా జాగ్రత్త పడేందుకు అవకాశమూ ఉంది. కాలేయంలో తలత్తే సమస్యలను ముందుగానే గుర్తించగలిగితే శస్త్రచికిత్స అవసరం లేకుండా, కేవలం మందులతో వ్యాధిని నయం చేయవచ్చు. కానీ, నిర్లక్ష్యం చేస్తే మాత్రం ఊహించనంత వేగంగా పరిస్థితి చేజారే ప్రమాదం ఉంది. అయితే, కాలేయం అసాధారణ పని సామర్థ్యం కారణంగా వ్యాధులు సోకినా... లక్షణాలు వెల్లడి కావటానికి పది నుంచి ఇరవై సంవత్సరాల సమయం కూడా పడుతుంది. సుదీర్ఘమైన ఈ సమయంలో కాలేయ కణాలు క్రమంగా మృతి చెందుతూ ఉంటాయి. దీంతో లివర్ స్కార్ (మచ్చలు లేదా సిరోసిస్) ఏర్పడుతుంటుంది. ఈ స్కార్ పూర్తిగా కాలేయాన్ని కప్పేసినప్పుడు రోగ లక్షణాలు స్పష్టంగా బయటపడతాయి. అప్పటికే వ్యాధి ముదిరిపోతుంది.



కాలేయానికి తీవ్రమైన వ్యాధులు సోకాయని సూచించే లక్షణాలు ఇవి: కళ్లు పచ్చగా మారతాయి. విడువని దురదలు బాధపెడుతుంటాయి. ఆకలి మందగిస్తుంది. నీరసంగా ఉండి ఎప్పుడూ నిద్ర ముంచుకొస్తుంటుంది. కడుపులో వికారంగా అనిపిస్తుంటుంది. ఏకాగ్రత కుదరదు. జ్ఞాపకశక్తి మందగిస్తుంది. చివరికి కోమాలోకి జారిపోతారు.

కాలేయ క్యాన్సర్‌కు దారితీయగల ప్రమాదం ఉన్న (దీర్ఘకాల మద్యపానం, వైరస్ వ్యాధులు సోకినవారు, ఫ్యాటీలివర్ వ్యాధి ఉన్న వారు) ఈ లక్షణాలు పూర్తిగా బయటపడే దాకా వేచి ఉండకుండా ముందస్తుగా పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. రక్తపరీక్ష, ఫైబ్రోస్కాన్ (ట్రాన్సియంట్ ఎలాస్టోగ్రఫీ) చేయించుకోవటం ద్వారా కాలేయ క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించవచ్చు. వ్యాధుల వల్ల కాలేయానికి జరిగిన నష్టాన్ని బట్టి దాని తీవ్రతను మూడు స్థాయులుగా గుర్తిస్తారు. వీటిని ఎ, బి, సి 'చైల్డ్ పగ్ స్టేజెస్' అంటారు. 'ఎ' చైల్డ్ స్థాయిలోనే డాక్టర్ వద్దకు రాగలిగితే మందులతో, అలవాట్లలో మార్పులతో చికిత్స చేసి పూర్తి సాధారణ పరిస్థితిని పునరుద్ధరించవచ్చు.

# మాడుగుల డిగ్రీ కళాశాలకు ఎట్టకేలకు సొంతగూడు



**మాడుగుల, పతాకం న్యూస్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎట్టకేలకు పద్దెనిమిది ఏళ్ల తరువాత సొంత గూడు ఒనగూరుతోంది. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో కోటి రూపాయల పైచిలుకు వ్యయంతో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి పనులన్నీ పూర్తిచేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి సొంత భవనాల్లో డిగ్రీ తరగతులు నిర్వహించేలా అధికారులు కృషి చేస్తున్నారు.

మాడుగులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2008లో మంజూరైంది. అప్పట్లో స్థలాన్ని ఎంపిక చేయకపోవడం, నిధులు విడుదల కాకపోవడతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల్లో తాత్కాలికంగా తరగతులను ప్రారంభించారు. సైన్స్, ఆర్ట్స్ గ్రూపులు వుండేవి. వసతి చాలకపోవడంతో ఉదయం ఉదయం 7.30 నుంచి 12.30 గంటల వరకు జూనియర్ కళాశాల, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు డిగ్రీ కళాశాల తరగతులను నిర్వహించడం మొదలుపెట్టారు. దీంతో తరగతుల వేళలు తగ్గడం, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం వంటివి లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సైన్స్ ల్యాబ్ ప్రాక్టికల్స్ కోసం చోడవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లి రావాల్సి వచ్చేంది. దీంతో పలువురు విద్యార్థులు ఇక్కడ చేరకుండగా, చోడవరం కళాశాలలో చేరడం మొదలుపెట్టారు. ఫలితంగా విద్యార్థుల సంఖ్య ఊహించినంతగా పెరగలేదు. సొంత భవనాల నిర్మాణంతోనే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని విద్యార్థులు, అధ్యాపకులు పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అయితే సరైన స్థలం లభించకపోవడంతో సొంతూ గూడు ఒనగూరలేదు. ఇదే సమయంలో జూనియర్ కళాశాల యాజమాన్యం నుంచి ఒత్తిళ్లు వచ్చాయి. ఇంటర్ తరగతులను పూర్తిస్థాయిలో నిర్వహించడానికి డిగ్రీ కళాశాలను వేరేచోటుకు తరలించాలని స్పష్టం చేశారు. దీంతో 2023 జూన్ నెలలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణానికి ఆనుకొని ఖాళీగా వున్న బాలికల వసతిగృహం భవనంలోకి డిగ్రీ కళాశాలను తరలించారు. ఇక్కడ మొత్తం 12 గదులు వుండడంతో పూర్తిస్థాయిలో తరగతుల నిర్వహణకు వీలుకలిగింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో బీఎస్సీ మ్యా??థ్స్, కంప్యూటర్స్, బోటనీ, జువాలజీ, బీఏ హిస్టరీ, పాలిటిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ గ్రూపులు ఉన్నాయి. సుమారు 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రిన్సిపాల్‌తో కలిపి 12 మంది అధ్యాపకులు ఉన్నారు. రెండుపూటలా తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే ఎప్పటికైనా బాలికల వసతిగృహ భవనాన్ని ఖాళీ చేయాల్సి వస్తుందన్న ఉద్దేశంతో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కళాశాలకు సొంత భవనాల కోసం స్థలం, నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సర్వే నంబరు 261లో 3.46 ఎకరాలు, సర్వే నంబరు 262లో ఒక ఎకరాల 54 సెంట్లు.. మొత్తం ఐదు ఎకరాలను కేటాయించేలా కృషి చేశారు. భవనాలకు నిధుల కోసం కలెక్టర్ విజయకృష్ణన్‌తో మాట్లాడారు. గత ఏడాది ఆగస్టులో జిల్లా అభివృద్ధి నిధుల్లో నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దృష్టికి కూడా తీసుకెళ్లడంతో ఆయన ఎంపీ నిధులు కోటి రూపాయిలు మంజూరు చేశారు. మొత్తం కోటి పది లక్షల రూపాయలతో సమగ్ర శిక్ష అధికారులు టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్‌తో భవన నిర్మాణ పనులు ప్రారంభింపజేశారు. , సర్వే నంబరు 262లోని స్థలంలో రెండు అంతస్థులతో భవనం నిర్మిస్తున్నారు. ఇందులో మొత్తం ఎనిమిది గదులు వుంటాయి. రెండో అంతస్థు శ్లాబ్ పనులు జరుగుతున్నాయి. ఈ భవనం పక్కనే ప్రిన్సిపాల్‌కు, ఆఫీసు కోసం చిన్నపాటి భవనం నిర్మిస్తున్నారు. ప్రహరీ గోడ, మరుగుదొడ్లు నిర్మిస్తారు.

# బ్యాంకర్లూ హద్దులు దాటొద్దు

## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**ముంబై:** అవసరం ఉన్నా లేకపోయినా బ్యాంకులు ఖాతాదారులకు బీమా పాలసీలు, ఇతర ఆర్థిక పెట్టుబడుల ఉత్పత్తులను అంటగట్టడంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పద్ధతులకు స్వస్తి చెప్పి తమ కీలక వ్యాపారమైన డిపాజిట్ల సేకరణ, రుణ వితరణపై దృష్టి పెట్టాలని కోరారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కేంద్ర బోర్డు సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. గృహ రుణం, వాహన రుణం ఇలా ఏ రుణం తీసుకున్నా బ్యాంకులు బలవంతంగా తమ చేత ఏదో ఒక బీమా పాలసీ కొనిపిస్తున్నాయని ఇటీవల బ్యాంకు ఖాతాదారుల నుంచి ఫిర్యాదులు పెరిగి పోయాయి. ఈ అక్రమాలకు చెక్ పెడుతూ ఆర్‌బీఐ ఇటీవల కొన్ని మార్గదర్శకాలు విడుదల చేయడంపై ఆర్థిక మంత్రి సీతారామన్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర బ్యాంకులు భారీగా కొనడం వల్లే భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్‌ంతగా బంగారం ధరలు అనూహ్యంగా పెరిగాయని నిర్మలా సీతారామన్ చెప్పారు. ప్రభుత్వం, ఆర్‌బీఐ పసిడి దిగుమతులను నిశితంగా గమనిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతానికైతే ఈ దిగుమతులు ఆందోళనకర స్థాయిలో లేవన్నారు. గత ఏడాది ఏప్రిల్-డిసెంబరు మధ్య కాలంలో మన పసిడి దిగుమతులు 5,000 కోట్ల డాలర్లకు చేరాయి. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది వంద కోట్ల డాలర్లు మాత్రమే ఎక్కువని సీతారామన్ చెప్పారు. ట్రంప్ సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు కొట్టి వేయడంపై మాట్లాడేందుకు ఆర్థిక మంత్రి నిర్మల నిరాకరించారు. ఈ అంశంపై ఇప్పుడు మాట్లాడడం తొందరపాటు అవుతుందన్నారు. ఈ తీర్పు పర్యవసానాలను కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ సమీక్షిస్తోందన్నారు.




# సఫారీల దెబ్బకు భారత్ సెమీస్ ఆశలపై నీళ్లు!



టీ20 వరల్డ్‌కప్‌లో దూసుకెళ్తున్న టీమిండియాకు ఒక్క ఓటమి కళ్లెం వేసింది. గ్రూప్ దశలో అజేయ ఆటతీరును ప్రదర్శించినా.. కీలక సూపర్-8 ఆరంభ పోరులో సఫారీల దెబ్బకు భారత్ సెమీస్ బెర్త్ క్లిష్టంగా మారింది. ఎందుకంటే.. ఈ మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో ఓటమి భారత్‌ను రన్‌రేట్ పరంగా దారుణంగా దెబ్బతీసింది. 188 పరుగుల ఛేదనలో మనోళ్లు చేసింది 111 పరుగులే కావడంతో ప్రస్తుతం గ్రూప్ 1లో భారత్ నెట్‌రన్‌రేట్ -3.800తో దయనీయంగా ఉంది. దీంతో జింబాబ్వే, వెస్టిండీస్‌తో మిగిలిన మ్యాచ్‌లను కచ్చితంగా గెలిచి తీరాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా కూడా సెమీస్ అవకాశాలు అంత సులువేమీ కాదు. మున్ముందు భారత జట్టు ఎలా ఆడాలనే విషయం పరిశీలిస్తే.. సూపర్-8లో భారత్‌కు మిగిలిన రెండు మ్యాచ్‌లను గెలిస్తే నాలుగు పాయింట్లు లభిస్తాయి. సెమీస్‌కు వెళ్లేందుకు ఈ ఫలితాలు సరిపోతాయి. కానీ ఇందుకు దక్షిణాఫ్రికా కూడా సహాయపడాల్సి ఉంటుంది. ఆ జట్టు కచ్చితంగా తమ రెండు మ్యాచ్‌ల్లోనూ గెలవాల్సి ఉంటుంది. అలాగైతేనే.. సఫారీలు ఆరు, భారత్ నాలుగు పాయింట్లతో సెమీస్‌కు వెళతాయి. పరిస్థితులు సవ్యంగా సాగకుండా.. భారత్ రెండు మ్యాచ్‌లు గెలిచి, వెస్టిండీస్ జట్టు సౌతాఫ్రికాకు షాకిస్తే మాత్రం సీన్ మారుతుంది. అప్పుడు భారత్, సౌతాఫ్రికా, విండీస్ కూడా నాలుగేసి పాయింట్లతో ఉంటాయి. ఆ సమయంలో నెట్ రన్‌రేట్ అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. జింబాబ్వేపై విండీస్ 107 రన్స్ తేడాతో గెలవడంతో వారి రన్‌రేట్ +5.350తో ఆకాశాన ఉంది. అందుకే భారత్ రెండు మ్యాచ్‌లను అలాఇలా గెలిస్తే సరిపోదు.. భారీ తేడాతో ప్రత్యర్థులను మట్టికరిపించాల్సి ఉంది.

# ఎవరిపైనో వేటు పడేను?

## తిలక్ వర్మా.. అభిషేక్ శర్మా?



టీ20 వరల్డ్‌కప్ సూపర్-8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఘోర పరాజయం తర్వాత భారత జట్టు కూర్పుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జట్టులో మార్పులు చేయడానికి మేనేజ్‌మెంట్ సిద్ధమవుతున్నట్టుగా సంకేతాలు అందుతున్నాయి. ముఖ్యంగా ఫామ్ కోల్పోయి జట్టుకు భారంగా మారిన టాపార్డర్ బ్యాటర్లలో ఒకరిపై వేటువేసే ఆలోచనలో ఉన్నట్టు సహాయ కోచ్‌లు టెన్ డస్కాటే, సితాన్షు కోటక్ మాటలను బట్టి తెలుస్తోంది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌తోపాటు వన్‌డౌన్‌లో వస్తున్న తిలక్ వర్మ కూడా లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్లు కావడంతో.. ఈ కాంబినేషన్ అంతగా విజయవంతం కావడం లేదన్న టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో అభిషేక్ లేదా తిలక్‌లో ఒకరిపై వేటుపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. లెఫ్ట్-రైట్ కాంబినేషన్ కోసం వరుసగా విఫలమవుతున్న అభిషేక్ స్థానంలో సంజూ శాంసన్‌కు తుది జట్టులో చోటు కల్పించవచ్చు. ఇక, తిలక్ ఫామ్ కూడా మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. అతడి ఆటలో ఆత్మవిశ్వాసం లోపించింది. ఒకవేళ కుడి చేతివాటం బ్యాటర్ సంజూతో ఓపెనింగ్ చేయిస్తే తిలక్‌ను తప్పించి.. అతడి స్థానంలో అభిషేక్‌ను చాన్సిస్తే ఎలా ఉంటుందనే వ్యూహంపై కూడా జోరుగా చర్చసాగుతోంది. కానీ, శాంసన్ వరుస వైఫల్యాల కారణంగానే కిషన్‌ను ఓపెనింగ్‌కు పంపాల్సి వచ్చిందనే విషయాన్ని గమనించాలి.

మెగా టోర్నీలో ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ ఓపెనర్లలో ఒకరు డకౌట్ కావడంతో.. ఆ ఒత్తిడి మిగతా బ్యాటర్లపై పడుతోందని డస్కాటే చెప్పాడు. సూర్యకుమార్, దూబేల ఆట నిరాశపర్చినా.. అభిషేక్, తిలక్ వైఫల్యాలను వెనకేసుకు రాలేమన్నాడు. ఫినిషర్‌గా రింకూకు తగిన అవకాశాలు లభించలేదనే అభిప్రాయం వ్యక్తం చేశాడు. జింబాబ్వేతో మ్యాచ్‌లో పూర్తిస్థాయిలో సత్తాచాటడమే జట్టుముందున్న ఏకైక లక్ష్యమని పేర్కొన్నాడు. అక్షర్‌కు బదులు సుందర్‌కు అవకాశం కల్పించడం వ్యూహాత్మకమేనని తెలిపాడు. కాగా, అక్షర్‌ను తప్పిస్తున్నట్టు కోచ్, కెప్టెన్ ముందుగానే సమాచారం ఇచ్చారని కోటక్ చెప్పాడు.

భారత ఆటగాళ్లు అహాన్ని పక్కనబెట్టి.. పరిస్థితులకు తగ్గట్టుగా ఆడాలని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ సూచించాడు. అతి విశ్వాసం కొంప ముంచిందన్నాడు. 'మరో ఆలోచన లేకుండా వచ్చిన వెంటనే బాదేయాలనుకొన్నారు. దక్షిణాఫ్రికా బౌలర్ల ఉచ్చులోచిక్కి వికెట్లు పారేసుకొన్నారు. అంతకుముందు సఫారీలు ఏదశ నుంచి గట్టెక్కారో గమనించి ఉండాల్సింది. ఎంతో తెలివిగా వ్యవహరించే తిలక్ కూడా నిరాశపర్చాడు. అతడు క్రీజులో కుదురుకోవడానికి కొంత సమయం తీసుకోవాల్సింద'ని గవాస్కర్ అన్నాడు. సుందర్ స్థానంలో అక్షర్‌ను తుది జట్టులోకి తీసుకోవాలన్నాడు.




# ఐశ్వర్య అర్జున్‌కి మిగిలింది చేదు అనుభవమే!



తెలుగు తెరకి వారసులుగా హీరోలు పరిచయం కావడం సాధారణమైన విషయమే. అయితే సీనియర్ హీరోల కూతుళ్లు హీరోయిన్స్ గా ఎంట్రీ ఇవ్వడమనేది ఈ మధ్యనే కాస్త ఊపందుకుంది. ఈ నేపథ్యంలోనే అర్జున్ కూతురు ఐశ్వర్య హీరోయిన్ గా టాలీవుడ్ లో అడుగుపెట్టింది. ఇక్కడ తన తొలి సినిమాగా 'సీతా పయనం' చేసింది. అర్జున్ ఈ సినిమాకి నిర్మాతగా .. దర్శకుడిగా వ్యవహరించడం విశేషం. అయితే ఈ సినిమా ఫలితం నిరాశపరిచిన విషయం తెలిసిందే.

నిజానికి అర్జున్ కూతురు కోలీ వుడ్ లో హీరో యిన్ గా అడుగుపెట్టి చాలాకాలమే అయింది. అప్పట్లోనే ఆమె తెలుగులో కూడా చేసి ఉండవలసింది. అయితే ఆమె టాలీవుడ్ వైపుకు రావడంలో చాలా ఆలస్యం చేసింది. నిజానికి ఈ సినిమా కోసం అర్జున్ టాలీవుడ్ లో చాలా వరకూ చుట్టబెట్టారు. ఎంతో మందిని కలుసుకున్నారు. ప్రమోషన్స్ వైపు నుంచి ఈ సినిమాను ఆడియన్స్ కి చేరువగా తీసుకుని వెళ్లడానికి చాలా ప్రయత్నాలు చేశారు. అయితే అవేవీ ఆశించిన ప్రయోజనాన్ని మాత్రం ఇవ్వలేకపోయాయి.

ఈ సినిమా విషయంలో రెండు రకాల అభిప్రాయాలు వినిపించాయి. అర్జున్ తన కూతురు సినిమాను తాను డైరెక్ట్ చేయకుండగా ఉండవలసిందనీ, నిర్మాతగా ఆయనే ఉండటం మంచిదైందని చెప్పుకున్నారు. ఎందుకంటే ఆర్థికపరమైన విషయాల వైపు నుంచి ఆయనకి విమర్శలు లేకుండా పోయాయి. కథలో అనవసరమైన విషయాల సంఖ్య పెరగడం, హీరోయిన్ తో పాటు హీరో కూడా కనెక్ట్ కాకపోవడం మైనస్ అయింది. మొత్తానికి ఈ సినిమా ఐశ్వర్య అర్జున్ కి చేదు అనుభవాన్నే మిగిల్చిందని చెప్పాలి.

# మార్చి 19న 'డెకాయిట్'



అడివి శేష్ లేటెస్ట్ మూవీ 'డెకాయిట్'. షానిల్ డియో దర్శకత్వంలో, మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా తెరకెక్కుతున్న ఈ థ్రిల్లర్ చిత్రం నుంచి తాజాగా ఒక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా మ్యూజిక్ జర్నీని ప్రారంభిస్తూ.. ఫిబ్రవరి 27న 'రూబారూ' అనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 'అతను ఆమెను ప్రాణంగా ప్రేమించాడు.. కానీ ఆమె అతనికి ఊహించని ద్రోహం చేసింది. తను ఒక దోపిడీదారుడిగా మారడానికి ముందు అతని జీవితంలో జరిగిన ఆ విలయం ఏంటి? అతను అనుభవించిన ఆవేదన ఏంటి?' అనేది ఈ పాట ద్వారా అర్థమవుతుందని అడవి శేష్ ఓ క్యాప్షన్ ద్వారా ఈ పాట అనౌన్స్‌మెంట్ చేశారు. ఈ సందర్భంగా ఒక పోస్టర్ కూడా విడుదల చేశారు. ప్రకాష్ రాజ్, అనురాగ్ కశ్యప్, సునీల్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలో కనిపించనున్న ఈ చిత్రం మార్చి 19న థియేటర్లలోకి రానుంది. శరణ్ రాజ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.

# నాని 32వ చిత్రం 'బ్లడీ రోమియో'



టాలీవుడ్ స్టార్ హీరో నాని తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు డబుల్ ట్రీట్ ఇచ్చారు. ఇప్పటికే 'ది ప్యారడైజ్' సినిమా అప్‌డేట్‌తో ఉత్సాహంలో ఉన్న ఫ్యాన్స్‌కు, తన 32వ చిత్రంతో మరో అదిరిపోయే సర్‌ప్రైజ్ అందించారు. 'ఓజీ' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో నాని చేయబోయే ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఓ అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేశారు.

గతంలోనే ప్రకటించిన ఈ ప్రాజెక్ట్, కొన్ని కారణాల వల్ల ఆలస్యమైనప్పటికీ, తాజాగా అధికారికంగా మొదలవడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ చిత్రం 'ఓజీ' యూనివర్స్‌కు సంబంధం లేదని, సుజీత్ తొలి చిత్రం 'రన్ రాజా రన్' తరహాలో స్టైలిష్ యాక్షన్‌తో కూడిన డార్క్ క్రైమ్ కామెడీగా ఉంటుందని తెలుస్తోంది. ఇందులో నాని ఒకవైపు చెఫ్‌గా కనిపిస్తూనే, మరోవైపు గ్యాంగ్‌స్టర్‌గా రెండు విభిన్న షేడ్స్ ఉన్న పాత్రలో నటించనున్నారని సమాచారం.

ఈ సినిమాలో నాని సరసన హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రి లేదా పూజా హెగ్డే పేర్లను పరిశీలిస్తున్నారు. మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఒక కీలక పాత్రలో నటించనున్నారని ప్రచారం జరుగుతోంది. నిహారిక ఎంటర్టైన్మెంట్స్, నాని సొంత బ్యానర్ అయిన యునానిమస్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, 2026 క్రిస్మస్ కానుకగా సినిమాను విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**